ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | శనివారం | 25.07.2026 | సంపుటి : 2 | సంచిక : 23 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు



## పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

**శాశ్వత ప్రాతిపదికన పక్కాగా నిర్వహణ చేపట్టాలి**

**నివేదిక కోరుతూ కేంద్రం, ఏటీఏకు సుప్రీం ఆదేశం**

న్యూఢిల్లీ, జూలై 24 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి -మిగతా 2 లో..

# పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు, 10కోట్ల జరిమానా?

## పేపర్ లీక్ కేసులపై కఠిన నిర్ణయం

**చట్టంలో మార్పులకు కేంద్ర కేబినెట్ నిర్ణయం**

**అధికారికంగా వెల్లడించని ప్రభుత్వం**

**పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ (ౖగావీ వీశీఱ) అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్‌ల (ౖఖుజావతీ ాముఃఎ) ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ (ఖఅఱశీఅ ఋఎఱఅవ్) ఆమోదించింది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.**



న్యూఢిల్లీ, జులై 24 : పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్‌ల ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును -మిగతా 2 లో..

## సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలి

యువతను ఫాలో కావడం అవసరమే

కేబినెట్ భేటీలో మంత్రులకు మోదీ సూచన

02



## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

**వారందరికి కేటీఆర్ 2 కోట్ల చొప్పున చెల్లించాలి**

**బర్త్‌డే రోజయినా అబద్ధాలు మాట్లడకుండా ఉండలేదు**

**మండిపడ్డ పిసిసి చీఫ్ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్**

**బీఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం బర్త్‌డే రోజైనా కెటిఆర్ అబద్ధాలు మాట్లాడకుండా ఉంటే మంచిదన్నారు.**

హైదరాబాద్, జూలై 24 : గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదన్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. నీట్ పేపర్ లీకైన నెలన్నరకు ఆయన నిద్రలేచారని మహేశ్ కుమార్‌గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. -మిగతా 2 లో..

## యువత పోరాటానికి అండగా ఉంటాం

**కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే**

**ఇందిరాపార్క్ ధర్నాలో కేటీఆర్ డిమాండ్**

**కాక్రోచ్ ఆందోళనలకు బీఆర్ఎస్ సంఘీభావం**

హైదరాబాద్, జూలై 24 : ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద -మిగతా 2 లో..






## సింగరేణి విస్తరణకు నిర్ణయం

**రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరణ**

**సింగరేణి భవిష్యత్తుకు అండగా ప్రజా ప్రభుత్వం**

**బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

భద్రాద్రి కొత్తగూడెం,జూలై 24 : సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. రాబోయే 15 – 20 ఏళ్లలో ఇంధన రంగం -మిగతా 2 లో..



## 'క్యూర్'లో ఇందిరమ్మ ఇళ్లు

**జనావాసాల పరిధిలోనే ఉండాలి: సీఎం రేవంత్‌రెడ్డి**

**ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు**

**పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ**

**క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం సమీక్ష**

హైదరాబాద్, జూలై 24 : నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను -మిగతా 2 లో..

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం

విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగిస్తే యాజమాన్యాలను బాధ్యులను చేయాలి

ఉన్నతాధికారులకు సిఎం రేవంత్ అదేశాలు



03



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98

## కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్‌పై సమగ్ర నివేదిక పంపాలి

**జల్ శక్తి మంత్రిత్వ శాఖ, ఎన్‌డీఎస్‌ఏ నుంచి మార్గదర్శకాలు కోరాలి**

**ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ఫ్రీ-ఫ్లో మోడ్‌లో బ్యారేజీలు**

**పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం**

**అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్, జులై 24 : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ -మిగతా 2 లో..



## తుంగతుర్తి ప్రజలు నన్ను క్షమించాలి

**నా మాట మీద మీరంతా సామేల్‌ను గెలిపించారు**

**సామేల్‌ను తానెప్పడూ అగౌరవపర్చలేదు**

**మీడియాతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

భువనగిరి,జులై 24 : తనకు ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు లేవని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం భువనగిరిలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తుంగతుర్తి కాంగ్రెస్ నేతలకు తాను క్షమాపణలు చెబుతున్నానని అన్నారు. భువనగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా సామేల్‌ను గౌరవిస్తాం.. ఆయన మాటలకు స్పందించ వద్దంటూ కార్యకర్తలకు -మిగతా 2 లో..



## ఆ వార్తలు అవాస్తవం

**బీఆర్ఎస్‌లోనే ఉంటా : ఎమ్మెల్యే మల్లారెడ్డి**

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భవిష్యత్తులో ముఖ్యమంత్రి అవుతారని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జోస్యం చెప్పారు. శుక్రవారం కంటోన్మెంట్ జయనగర్ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయం ఆవరణలో కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో కలిసి మల్లారెడ్డి కేక్ కోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని.. పార్టీని వీడుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. యూనివర్సిటీల ఏర్పాటు విషయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి కేంద్ర పెద్దలను కలిశామన్నారు. దాన్ని రాజకీయ కోణంలో చూస్తూ తాను భాజపాలో చేరుతున్నట్లు వక్రీకరించారని చెప్పారు.



# పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు, రూ.10కోట్ల జరిమానా?

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కేంద్రం కీలక సవరణలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై శుక్రవారం జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చలు జరిపారు. అనంతరం ఈ ముసాయిదా బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. ఇక, పేపర్ లీకులపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దిల్లీ న్యాయస్థానంలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటవ్వగా.. మరో నాలుగింటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ న్యాయస్థానాల పరిధిలో.. లీకులకు సంబంధించిన కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసి దోషులకు శిక్ష విధించేలా బిల్లులో ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. వచ్చే వారం ఈ బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది. నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించింది. లీకేజీ ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్వయంగా ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు.

# సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలి

### యువతను ఫాలో కావడం అవసరమే

### కేబినేట్ భేటీలో మంత్రులకు మోడీ సూచన



**న్యూఢిల్లీ,జులై 24 :** యువతకు మరింతగా చేరువయ్యేందుకు కేంద్ర మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం కేబినెట్ సమావేశం సందర్భంగా మంత్రులకు ఈ మేరకు సూచించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత మంది యాక్టివ్‌గా ఉంటున్నారని ప్రధాని మోదీ మంత్రులను ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ సమయం సోషల్ మీడియాలోనే ఉంటున్నట్టు చెప్పారు. కాబట్టి ప్రభుత్వం సోషల్ మీడియా వేదికల్లో యువతకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేసినంత మాత్రాన సరిపోదని ప్రధాని మంత్రులకు చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో నేరుగా యువతతో టచ్‌లో ఉండాలని ప్రధాని సూచించారు. యువతకు మరింత దగ్గర చేసే రీల్స్ వంటి క్రియేటివ్ కంటెంట్‌ను పోస్టు చేస్తూ ఉండాలని కూడా ప్రధాని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పేపర్ లీక్ నిందితులకు కఠిన శిక్షలు విధించే ముసాయిదా చట్టంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ ఈ సూచనలు చేసినట్టు తెలుస్తోంది. ఈ బిల్లుకు కేంద్రం ఆమోదం లభించినట్టు కూడా తెలుస్తోంది. పేపర్ లీకేజీలకు పాల్పడే వారికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకూ జరిమానా విధించేలా నిబంధనలు రూపొందించినట్టు తెలుస్తోంది.

# గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

(మొదటిపేజీ తరువాయి)

నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. 'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు

# నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

### వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ

### లోక్‌సభ సోమవారానికి వాయిదా

### రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్

**న్యూఢిల్లీ,జూలై24 :** లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగింది. నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలావుంటే వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్ష సహా ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలనూ ఇందులో పొందుపరిచారు. అయితే.. ఈ బిల్లుపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాజ్యసభ కార్యకలాపాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

# 'క్యూర్'లో ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే పక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్‌పై సమగ్ర నివేదిక పంపాలి



(మొదటిపేజీ తరువాయి)

సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను నీటి నిల్వ లేకుండా విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని మంత్రి తేల్చిచెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జతచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను ఎందుకు నీటి నిల్వకు, పంపింగ్‌కు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలి. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా మంత్రి ఆదేశించారు. సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీ-ఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని వివరించారు. మంత్రి మాట్లాడుతూ, కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్‌ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణ పనులపై జరిగిన సమీక్షలో అధికారులు మంత్రి దృష్టికి కీలక అంశాలను తీసుకువచ్చారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక సమాచారం విశ్లేషణను తుది దశకు తీసుకెళ్లిందని తెలిపారు. అలాగే అన్నారం బ్యారేజీ రాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని అధికారులు వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, మధ్య సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు తెలిపారు.

# సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)



స్వరూప స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయని ఆయన అన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగితే, క్రమంగా థర్మల్ విద్యుత్ మరియు బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని చెప్పారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయం లో సింగరేణి, జెన్ కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిది. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే, ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొను గోలు చేసేవారని ఆ న్నారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయి ందని చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీనితో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణా వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవ ల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని అన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠినంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు. బొగ్గు శుద్ధీకరణకు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి.. వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేక పోయిందని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదని అన్నారు. సింగరేణి అనేది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని, మైన్ స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో ఓపెన్ చర్చలు ప్రారంభించాలని అన్నారు. సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం విపరీతంగా మారబోతోందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ ఆధారిత బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇవి పెరిగితే థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని అధికారులకు సూచనలు చేశారు. సెమీకండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు.




# యువత పోరాటానికి అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరపున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని కేటీఆర్ చురకలు అంటించారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)



నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో , పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని ఉపయోగించడంపై జస్టిస్ పి.ఎస్. నరసింహ వ్యాఖ్యానిస్తూ... ఇది ఒక తాత్కాలిక నివారణ చర్య మాత్రమే తప్ప, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాగే, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని కాపాడే డేటా రక్షణ చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. అభ్యర్థుల ధృవీకరణ కోసం 'డిజీయాత్ర' వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే ప్రతిపాదనలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రానికి సూచించింది. పరీక్షల పర్యవేక్షణకు సంబంధించి ప్రతిపాదించిన గవర్నింగ్ బోర్డు, నిపుణుల కమిటీలు, స్టేక్‌హోల్డర్ నామినేషన్ల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందో నివేదికలో తెలపాలని ఆదేశించింది. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, కోర్టు సూచించిన అన్ని అంశాలతో సమగ్రమైన తాజా అఫిడవిట్‌ను త్వరలోనే దాఖలు చేస్తామని హామీ ఇచ్చారు. దానికి ధర్మాసనం ఆమోదం తెలిపింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# తుంగతుర్తి ప్రజలు నన్ను క్షమించాలి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. తప్పుడు వ్యక్తిని బరిలోకి దింపి గెలిపించానని ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. ఆయారాం గయారాంలకు తాను భయపడనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వాళ్లను గౌరవిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్టీ మారింది తాను ఒక్కడినే అని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యే మందుల సామేల్‌పై తానెప్పుడు వ్యక్తిగతంగా మాట్లాడలేదన్నారు. రాష్ట్రంలో తాను అడిగింది రెండు సీట్లలో తుంగతుర్తి ఒకటిని చెప్పారు. మందుల సామేల్‌కు టికెట్ ఇప్పించి.. ఆయన గెలుపునకు సహకరించానని చెప్పారు. తన అభిమానుల మద్దతుతో గెలిచి.. నేడు తనపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో నిజమైన కార్యకర్తలను కాపాడుకోవడమే తన లక్ష్యమని తెలిపారు. వారి న్యాయం చేసేందుకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కోరారు. తనని నమ్మి సామేల్‌ను గెలిపించినందుకు తుంగతుర్తి ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తనని క్షమించాలని కోరారు. సామేల్ ఎలాంటి విమర్శలు చేసినా కోమటిరెడ్డి బ్రదర్స్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు సహనంతో ఉండాలి. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని గౌరవిస్తాం. అదే సమయంలో పాత కార్యకర్తలను విస్మరించిన వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదు. నిజమైన కార్యకర్తలను కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగానికైనా సిద్ధమేనని రాజగోపాల్‌రెడ్డి కోరారు.

# ఆందోళన ముసుగులో అరచాక శక్తులు

- పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు
- పోలీసులు, జర్నలిస్టులపై దాడులకు తెగించారు
- నిజమైన విద్యార్థుల చేతుల్లో రాళ్లు ఎక్కడినుంచి వచ్చాయి
- విపక్షాలు పార్లమెంట్‌కు రాకుండా ఎగదోసే కార్యక్రమం చేశాయి
- దుష్ప్రచారం చేస్తున్న పాక్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లు సీజ్
- గతంలో అన్ని రాష్ట్రాల్లో పేపర్లు లీక్ అయితే వారంతా రాజీనామా చేశారా
- మీడియా సమావేశంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, జూలై 24 :** ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో మతతత్వ, కమ్యూనిస్ట్ శక్తులు అరాచకం సృష్టించాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. అలాగే పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్ర కూడా చేశారని మండిపడ్డారు. అందులో భాగంగానే దేశ వ్యతిరేక నినాదాలు చేశారని ఆరోపించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. పోలీసులు, జర్నలిస్టులపై దాడులతో పాటు అసభ్యంగా ప్రవర్తించారని వివరించారు. పోలీసుల తలలు పగిలినా ఎక్కడా ఫైరింగ్ చేయలేదని గుర్తు చేశారు. ఈ సమయంలో 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విధి లేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరిగా పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని వివరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశమని అన్నారు. అందుకే ఈ విషయంలో అందరికంటే ప్రధాని మోదీ ఎక్కువగా బాధపడుతున్నారని చెప్పారు. పేపర్ లీక్ చేసిన నిందితులను కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సీబీఐ ఇప్పటికే 11 మంది ఫ్యాకల్టీతో సహా 17 మందిని అరెస్ట్ చేశారని వివరించారు. విద్యార్థుల ఆందోళనను తాము అర్థం చేసుకున్నామని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణలు చెప్పారని అన్నారు. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా 40 రోజుల్లోనే నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించి.. వాటి ఫలితాలు కూడా ప్రకటించారని వివరించారు. పాకిస్తాన్ నుంచి సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని అన్నారు. అందుకే ఆ దేశానికి చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసిందని చెప్పారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కోరుతున్నానని తెలిపారు. నీట్‌కు, ఆర్టికల్ 370 రద్దుకు సంబంధం ఏమిటి? నీట్‌కు, ఆజాద్ కాశ్మీర్‌కు సంబంధం ఏమిటి? నీట్‌కు బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంకకు సంబంధం ఏమిటి? నీట్‌కు సనాతన ధర్మానికి, రాముడికి, సీతమ్మకు సంబంధమేమిటి? అని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సందేహం వ్యక్తం చేశారు. విద్యార్థులెవరూ దేశ ద్రోహ నినాదాలు చేయబోరని పేర్కొన్నారు. డాక్టర్ కావాలనుకునే విద్యార్థులెవరూ రాళ్లు విసరరని పేర్కొన్నారు. లాఠీలు పట్టుకొని, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించరని అన్నారు. పార్లమెంట్‌లో ఎందుకు చర్చలకు సిద్ధంగా లేరంటూ విపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. చర్చలతో రాద్దాంతాలు చేసి రాజకీయం చేయడమే వాళ్ల లక్ష్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకై రెండు నెలలు దాటినా కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఏనాడూ దీనిపై పెదవి విప్పలేదని చెప్పారు. కాక్రోచ్ పార్టీ ధర్నాలతో మొన్న సడన్‌గా ప్రధాని నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ కుట్ర చేసిందని ఆరోపించారు. నీట్ సమస్య పరిష్కారం, విద్యార్థుల భవిష్యత్తుపై ఇండియా కూటమికి ఆలోచనే లేదని చెప్పుకొచ్చారు. మోదీని దించి కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌ను ప్రధానిని చేయడమే వాళ్ల ఏకైక లక్ష్యమని అన్నారు. అందుకోసమే ప్రధాని, హోం, విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ చేస్తే సంసారం... ఇతరులు చేస్తే వ్యభిచారమా? అని విపక్ష తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వ హయాంలో ప్లస్ 2 పేపర్ లీకైతే కేజ్రీవాల్ సారీ చెప్పారా? సీఎంతో రాజీనామా చేయించారా? అని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు. కర్నాటకలో టెన్త్ క్లాస్, పీయూసీ పేపర్ లీకైతే సీఎంతో, విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేయించారా? అని కాంగ్రెస్ నేతలను ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్, అఖిలేష్ యాదవ్ ప్రభుత్వ హయాంతో ఎన్నోసార్లు పేపర్ లీక్ అయ్యాయని గుర్తు చేశారు. మరి వారు రాజీనామా ఎందుకు చేయలేదంటూ విపక్షాలను బల్లగుద్ది ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పేపర్ లీకైతే నాటి సీఎం మమత బెనర్జీ రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. కేరళలో ఎల్‌డీఎఫ్ పాలనలో స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగితే పినరయి విజయన్ ఎందుకు సీఎం పదవికి రాజీనామా చేయలేదని అన్నారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వం అంటేనే పేపర్ లీక్ ప్రభుత్వంగా మారిందని.. ఇది నిజం కాదా? అని ప్రశ్నించారు. నాడు ఎంసెట్ పేపర్, టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 1 పేపర్, ఎస్ఎస్‌సీ తెలుగు, హిందీ పేపర్లు లీకయ్యాయన్నారు. పరీక్షలంటే పేపర్లు అమ్ముకుని విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. మరి ఆనాడు కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా? అని నిలదీశారు. తాను గ్రూప్-1 పేపర్ లీక్‌పై పోరాటం చేస్తుంటే ఏమైందో మీరంతా చూశారని చెప్పారు. టెన్త్ పేపర్ లీక్ చేస్తే వాడిని పట్టుకోకుండా తనపై కేసు పెట్టి అరెస్ట్ చేసి జైలుకు పంపారని గుర్తు చేసుకున్నారు. ఇన్ని తప్పిదాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా పేపర్ లీక్‌పై ధర్నా చేయడమేమా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చౌక్‌ను ఎత్తేసినోడు ఈరోజు ధర్నాకు కూర్చుంటే ఇందిరా పార్క్, ఎన్టీఆర్ స్టేడియం నవ్వుతున్నట్టుంటూ వ్యంగ్యంగా అన్నారు. కనీసం పుట్టినరోజు కూడా నిజాలు చెప్పలేదు.. నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బండి సంజయ్ మండిపడ్డారు. ÷-విట్టర్ టిల్లు బినామీ సంస్థ గ్లోబరీనా నిర్వాకం వల్ల 27 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే కనికరం లేకుండా వాళ్ల తల్లిదండ్రులపై లాఠీఛార్జ్ చేయించిన ఘటనలు మర్చిపోగలమా? అని పేర్కొన్నారు. మీ బినామీ సంస్థ వల్ల అంత మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు రాజీనామా చేయలేదని బీఆర్ఎస్ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇదే విషయంపై కేటీఆర్‌ను నిలదీయండి.. అప్పుడైనా బుద్ధి వస్తుందంటూ జెన్ జీ తరం పిల్లలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు.



## డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు

### ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్,జూలై 24 :** డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఆయా సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్నే బాధ్యులను చేయాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ÷ుద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం.. ఈ మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని అన్నారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో డ్రై పోర్టుల నిర్మాణం

### పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం సుముఖం

#### విజయవాడ ఎంపి ప్రశ్నకు మంత్రి లిఖిత సమాధానం

**న్యూఢిల్లీ, జూలై 24 :** తెలుగు రాష్ట్రాల పారిశ్రామికాభివృద్ధి, ఎగుమతి-దిగుమతి రంగాలకు ఊతమిచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ, తెలంగాణలోని చిట్యాల వద్ద కొత్త డ్రై పోర్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించింది. ఇదే సమయంలో తెలంగాణలోని ఫతేపూర్ డ్రై పోర్టు ప్రాజెక్టుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు స్పష్టం చేసింది. ఈ వివరాలను విజయవాడ లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. పారిశ్రామిక ఉత్పత్తుల రవాణా వ్యయాన్ని తగ్గించడం, ఎగుమతులను వేగవంతం చేయడం, అంతర్జాతీయ లాజిస్టిక్స్ వ్యవస్థతో అనుసంధానం కల్పించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం డ్రై పోర్టుల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా కస్టమ్స్ (సీబీఐసీ) ఆధ్వర్యంలోని అంతర్-మంత్రిత్వ కమిటీ ఇప్పటికే ఎనిమిది కొత్త డ్రై పోర్టుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందని, మరో తొమ్మిది ప్రతిపాదనలు పరిశీలన దశలో ఉన్నాయని వెల్లడించారు. అందులో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ, తెలంగాణలోని చిట్యాల ప్రతిపాదనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.డ్రై పోర్టుల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రాలను గ్రీన్, బ్లూ, రెడ్ జోన్‌లుగా విభజించినట్లు మంత్రి వివరించారు. లాజిస్టిక్స్ విస్తరణకు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణను గ్రీన్ జోన్లో చేర్చి, డ్రై పోర్టు ఏర్పాటు కోసం అవసరమైన కనీస భూవిస్తీర్ణాన్ని ఏడు హెక్టార్ల నుంచి మూడు హెక్టార్లకు తగ్గించడం ద్వారా పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను బ్లూ జోన్లో ఉంచి, పారిశ్రామిక డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో కొత్త డ్రై పోర్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డ్రై పోర్టుల ఆర్థిక సాధ్యతను దృష్టిలో ఉంచుకుని ఒకదానికొకటి 100 కిలోమీటర్ల పరిధిలో కొత్త గ్రీన్‌ఫీల్డ్ డ్రై పోర్టులకు అనుమతి ఇవ్వబోమని, అలాగే సముద్ర ఓడరేవుకు 200 కిలోమీటర్లకు మించిన దూరంలో ఉన్న ప్రాంతాల్లో రైల్వే అనుసంధానంతో కూడిన ఐసీడీల ఏర్పాటుకు ప్రాధాన్యం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పరిణామంతో ముఖ్యంగా శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న దేశీయ, అంతర్జాతీయ పరిశ్రమలకు భారీ ఊరట లభించే అవకాశముంది.

## టూ వీలర్ ఢీ.. యువకుడు మృతి

**మహబూబాబాద్,జూలై 24 :** గూడూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నర్సంపేట నుంచి మహబూబాబాద్ వైపు ఎర్రమట్టి లోడుతో వెళ్తున్న లారీ గూడూరు మండల కేంద్రంలో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గూడూరు గ్రామ శివారులోని శివాలయం ఎస్సీ కాలనీకి చెందిన కే. విష్ణు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతుడు విష్ణు గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న గూడూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి, ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ పథకానికి కార్పోరేట్ చేయూత

### అరబిందో ఫార్మా, దివీస్ భారీగా విరాళాలు అందచేత

**హైదరాబాద్,జూలై 24 :** ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న బ్రేక్‌ఫాస్ట్ పథకానికి కార్పొరేట్ సంస్థలు భారీగా చేయూతనందించాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా అరబిందో ఫార్మా రూ. 10 కోట్లు, దివీస్ లేబొరేటరీస్ రూ. 12.18 కోట్లు విరాళంగా అందించాయి. దీంతో మొత్తం రూ. 22.18 కోట్ల నిధులు బ్రేక్‌ఫాస్ట్ స్కీం అమలుకు అందాయి. హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం కూడా అందించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు అందించిన అరబిందో ఫార్మా, దివీస్ లేబొరేటరీస్ సంస్థలను అభినందించారు. అదే సమయంలో సెంట్రలైజ్డ్ కిచెన్ల కోసం అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులను రైతుల నుంచే నేరుగా కొనుగోలు చేసే విధానంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. రైతులను సేంద్రియ సాగు వైపు ప్రోత్సహించడం, నాణ్యమైన విత్తనాలతో పంట మార్పిడిని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని కూడా బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

### కాలిఫోర్నియా పర్యటనలో మంత్రి సీతక్క పిలుపు

**హైదరాబాద్,జూలై24 :** పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న బాపూజీ స్ఫూర్తితో ప్రవాసులు తెలంగాణ గ్రామీణాభివృద్ధికి సహకరించాలని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. కాలిఫోర్నియా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్‌లో ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. సీఎం కృషికి చేయూతగా ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు, ఉపకారవేతనాలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఢిల్లీలో సీజేపీ విద్యార్థులకు మద్దతుగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఓవర్‌సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు సందీప్ వంగల, నెమలి మాధవ, శ్రీనివాస్ రామసహాయం, గూడూరు రవీందర్ రెడ్డి, గీతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో నేడు వనమహోత్సవం

### ఒక్కో కుటుంబానికి పండ్ల మొక్కలు పంపిణీ

**హైదరాబాద్,జూలై 24 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'వన మహోత్సవం-2026' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ప్రజల భాగస్వామ్యంతో నగర హరితాభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం 4.00 గంటలకు తార్నాకలోని మర్రి లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్ లో తారక సేవా సమాఖ్య (ఎన్‌జీఓ) సహకారంతో ప్రతి కుటుంబానికి ఐదు ఉచిత పండ్ల, ఔషధ, అలంకరణ మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ద్వారా నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, భూగర్భ జలాల పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణతో పాటు ప్రతి ఇంటిలో ఆరోగ్యకరమైన ఇంటి తోటల ఏర్పాటును ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉచిత మొక్కలను పొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ఆ ప్రకటనలో తెలిపారు.

## మా జోలికి వస్తే రాజకీయ సమాధి తప్పదు

### మేమే డప్పులు కొడతాం.. దండోరా మోగిస్తాం

#### కోమటిరెడ్డి బ్రదర్స్‌కు మందుల సామేలు హెచ్చరిక



**సూర్యాపేట, జూలై 24:** జిల్లా కాంగ్రెస్ రాజకీయంలో తీవ్ర సంచలనం చోటుచేసుకుంది. తుంగతుర్తి కాంగ్రెస్ శాసనసభ్యుడు మందుల సామేల్ సొంత పార్టీకి చెందిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయంలో కోమటిరెడ్డి సోదరుల వైఖరిని తప్పుబడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. మా జోలికొస్తే మీ రాజకీయ సమాధికి మేమే డప్పులు కొడతాం, మా దండోరా మోగుతుంది. అహంకార పూరితమైన రాజకీయాన్ని చావుదెబ్బ తీస్తాం' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్లగొండ జిల్లా ఎవరి రాజ్యమూ కాదని, ఇది శ్రమజీవుల జిల్లా అని స్పష్టం చేస్తూ, తనతో పాటు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజల అభిమానంతోనే గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టామని ధీమా వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో తనకు సమాచారం లేకుండా పర్యటించడంపై ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తుంగతుర్తికి ఒక ఎమ్మెల్యే ఉన్నాడనే విషయం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తెలియడం లేదు. స్థానిక శాసనసభ్యుడినైన నాకు తెలియకుండా నా నియోజకవర్గానికి ఎలా వస్తారు? కనీస ప్రోటోకాల్ పాటించరా?' అని ప్రశ్నించారు. కోమటిరెడ్డికి ఎస్సీ నియోజకవర్గాలంటే చిన్నచూపని, మాదిగలపై వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. మాదిగలు ఎవరికీ బానిసలు కాదని స్పష్టం చేసిన ఆయన, ఇదే తరహా పద్ధతి కొనసాగితే ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ గౌరవానికి భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, అంతకు అంత ప్రతికారం తీర్చుకుంటామని సామేల్ హెచ్చరించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై కూడా మందుల సామేల్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. గతంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి ఎందుకు వెళ్లారో రాజగోపాల్ రెడ్డి ముందుగా సమాధానం చెప్పాలని నిలదీశారు. మునుగోడు నియోజకవర్గంలో రాజగోపాల్ రెడ్డి తీరుపై తమకు పూర్తి రిపోర్టు వచ్చిందని వ్యాఖ్యానించారు. నాయకులు తమ నియోజకవర్గాలపై దృష్టి సారిస్తే మంచిదని, ఎస్సీ స్థానాలైన తమ సీట్లపై ఇతరుల పెత్తనం ఏంటని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామం 5 లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంతో పాటు 12 లక్షల రూపాయల తో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సామ్యూల్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమం

### డిజిటల్ అడ్వర్‌టైజింగ్ హబ్‌లుగా మీ సేవ కేంద్రాలు

#### చిన్న వ్యాపారాలకు అందుబాటులోకి డిజిటల్ మార్కెటింగ్ సేవలు

**హైదరాబాద్,జూలై 24 :** తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ మీ సేవ ఆధ్వర్యంలో, అంతర్జాతీయంగా పేరొందిన మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా తీర్చిదిద్దే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రకటనల సేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో క్యూర్ ప్రాంతానికి చెందిన 150 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ పాల్గొన్నారు. మెటా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రకటనలను రూపొందించడం, వాట్సప్ బిజినెస్ ఎకౌంట్‌ను క్రియేట్ చేయటం, తమ ఉత్పత్తులను ఆ ఎకౌంట్ ద్వారా ప్రచారం చేయడం, వినియోగదారులను గుర్తించడం, డిజిటల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలపై వారికి శిక్షణ అందించారు. కార్యక్రమం ద్వారా కిరాణా షాప్స్, పండ్ల వ్యాపారులు, స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, ఆసుపత్రులు, పాఠశాలలు, సెలూన్లు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలు, పెద్ద సంస్థలు తదితర అన్ని రకాల వ్యాపారాలు తమ సమీపంలోని మీ సేవా కేంద్రాన్ని సంప్రదించి మెటా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రొఫెషనల్ డిజిటల్ ప్రకటనలను రూపొందించి ప్రచారం చేసుకునే అవకాశం పొందుతాయి. మీ సేవా నిర్వాహకులు ప్రకటనల రూపకల్పన, ప్రచార కంటెంట్ తయారీ, సరైన వినియోగదారుల ఎంపిక, ప్రకటనల ప్రచురణ తదితర అంశాల్లో పూర్తి సహాయాన్ని అందిస్తారు. దీంతో వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలకు మరింత ప్రచారం కల్పించుకొని, ఎక్కువ మంది వినియోగదారులను చేరటం ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా మీ సేవ కమిషనర్ టి. రవి కిరణ్ మాట్లాడుతూ.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం సాంకేతికత ద్వారా పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. మెటా సంస్థకు ఉన్న ప్రపంచ స్థాయి డిజిటల్ అడ్వటంల్గ÷జింగ్ నైపుణ్యాన్ని, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న మీ సేవా కేంద్రాల నెట్‌వర్క్ తో అనుసంధానం చేయడం ద్వారా ఇప్పటివరకు డిజిటల్ మార్కెటింగ్‌కు దూరంగా ఉన్న చిన్న, గ్రామీణ వ్యాపారాలకు కూడా నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

## బెల్లంపల్లి గురుకుల ఫుడ్ పాయిజన్ ఘటన

### టీజీహెచ్‌ఆర్‌సీ సుమోటో కేసు

**హైదరాబాద్,జూలై 24 :** డా. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన ఉన్న తెలంగాణ మానవ హక్కుల కమిషన్ బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్' వార్తను సుమోటోగా స్వీకరించింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఆహార విషబాధకు గురైన ఘటనపై సమగ్ర నివేదికను సమర్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది. ఈ కేసును నివేదిక కోసం ఆగస్ట్ 25కు వాయిదా వేసింది.

## మోడీపై వ్యక్తిగత విమర్శలు సహించం

### రాహుల్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బిజెపి కార్యకర్తలు

**మెదక్,జూలై24 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అన్నారు. నీట్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుని బాధ్యులను అరెస్టు చేసిందన్నారు. అనంతరం పరీక్షను తిరిగి నిర్వహించడంతో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. నీట్ అంశాన్ని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. దేశంలో అశాంతి సృష్టించే విధంగా కార్యక్రమాలకు పిలుపునివ్వడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై వ్యక్తిగత విమర్శలు చేయడం, ఆయన నివాసాన్ని ముట్టడించే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. జరిగిన తప్పులను సరిదిద్దాల్సింది పోయి, రాజకీయ లబ్ది కోసం నీట్ అంశాన్ని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

# బొద్దింకలను తేలికగా తీసుకోరాదు!




**దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది.**

ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహాలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు.

దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్త చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది.

ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది.పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఓక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువే లేదు. శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగు బాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవర మైన పనులనే చేయాలి. అప్పడే దేశం బాగుపడుతుంది. మాటలతో ఎంతోకాలం మభ్య పెట్టలేమని గుర్తిస్తే, బొద్దింకల బాధా ఉండదు.

# సీజేపీ నిరసనలకు దూరంగా ఉండాలి

**విద్యార్థులకు ఢిల్లీ యూనివర్సిటీ అడ్వయిజరీ జారీ**
**యూనివర్సిటీల తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ**




**న్యూఢిల్లీ, జూలై 24 :** జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న సీజేపీ నిరసనలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఢిల్లీ విశ్వవిద్యాలయం జారీ చేసిన అడ్వైజరీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజాస్వామ్య హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులను బెదిరించడం అంగీకారయోగ్యం కాదని మండిపడ్డారు. విద్యార్థుల హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్న వారే భవిష్యత్తులో జవాబుదారీగా నిలవాల్సి వస్తుందని రాహుల్ హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రజాస్వామ్య హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులను బెదిరించే హక్కు మీకెవరిచ్చారంటూ ప్రశ్నించారు. సమయం వచ్చినప్పుడు దీనికి మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఢిల్లీ వర్సిటీని ఎంపీ రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, నీట్–యూజీ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న నిరసనల దృష్ట్యా ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులకు భద్రతా సూచనలు జారీ చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జంతర్‌మంతర్‌లో నిరసనలు కఠిన నియంత్రణలో ఉంటాయని పేర్కొంది. చట్టవిరుద్ధంగా నిర్వహించే సభలు, ఆందోళనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చని హెచ్చరించింది. అలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల వ్యక్తిగత భద్రతకు ముప్పు ఏర్పడటంతో పాటు విద్యాభ్యాసం, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల విద్యార్థులు జంతర్‌మంతర్ వద్ద జరిగే ఆందోళనలకు దూరంగా ఉండి, తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. సోషల్ మీడియాలో తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారం విస్తృతంగా ప్రచారం అవుతోందని డీయూ పేర్కొంది. ఎలాంటి సమాచారాన్నైనా విశ్వసించి, ఇతరులతో పంచుకునే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని విద్యార్థులకు సూచించింది. ఈ క్రమంలో నీట్ లీక్‌పై సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతోన్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు యూనివర్సిటీలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతోన్న తప్పులను ప్రశ్నించడానికి.. విద్యార్థులు తమ ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్నారన్నారు. వారిని ఆందోళనల్లో పాల్గొన వద్దని హెచ్చరించడానికి మీకెంత ధైర్యం అంటూ మండిపడ్డారు. సమయం వచ్చినప్పుడు ఇలాంటి చర్యలకు ఆయా విశ్వవిద్యాలయాలు జవాబుదారీగా ఉండాల్సి ఉంటుందన్నారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే ఆందోళనలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని.. అందువల్ల ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లొద్దని దిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూర్కీ, ఐఐటీ మద్రాస్ సహా పలు విద్యాసంస్థలు తమ విద్యార్థులకు సూచించాయి. సోషల్ మీడియాలో కూడా నిరసనలకు సంబంధించి ఎలాంటి పోస్టులు చేయొద్దని కోరాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఈ హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపాయి.

ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ స్పందించారు. విశ్వవిద్యాలయాలు ఇచ్చిన సర్క్యులర్‌పై పలువురు ప్రముఖులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. 'దిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా.. పార్లమెంట్ సభ్యుడిగా డీయూ విడుదల చేసిన ఈ ప్రకటనను ఖండిస్తున్నాను. జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలు చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారు. ఇలాంటి విషయాల్లో తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని ఎంపీ దీపేందర్ హుడా తెలిపారు. విద్యార్థుల గొంతులను అణచివేస్తే వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుంది. మనకు నిజంగా వారి భవిష్యత్తుపై ఆందోళన ఉంటే.. మౌనంగా ఉండకుండా విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులకు మద్దతు ఇవ్వాలని నటి, చిత్రనిర్మాత పూజాభట్ అన్నారు.

## ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం

**ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు వెనక్కి తగ్గం**
**విద్యార్థుల భవిష్యత్ కోసమే తమ ఆందోళన**
**కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి**



**న్యూఢిల్లీ, జూలై 24 :** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏమీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోబోమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చర్చల కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లబోమని.. జంతర్‌మంతర్ వద్దే చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కఠిన చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులపై దిల్లీ పోలీసుల దమనకాండను ఖండించారు. సీజేపీ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో దిల్లీలోని జంతర్ మంతర్ వద్దకు వేల సంఖ్యలో యువకులు చేరుకుంటున్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున భద్రతాబలగాలను మోహరించారు.

## విద్యార్థుల నిరసనలపై ప్రభుత్వ తీరు గర్హనీయం

**మోడీ ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్ ఎంపి సోనియా**
**వైఫల్యాలను ఏకరవు పెడుతూ ప్రకటన విడుదల**



**న్యూఢిల్లీ, జూలై 24 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు. ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు సోనియాగాంధీ ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా వ్యవస్థలో తీవ్రమైన వైఫల్యాలు వెలుగులోకి వచ్చినప్పటికీ సదరు కేంద్ర మంత్రి బాధ్యత వహించకుండా పదవిలో ఇంకా కొనసాగుతున్నారని సోనియా గాంధీ ధ్వజమెత్తారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ప్రస్తావించారు. జాతీయ పరీక్షల నిర్వహణ వ్యవస్థలో లోపాలపై మోదీ ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ల చేతుల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహణను ఉంచడం వల్లే ఈ పరీక్షల విశ్వసనీయత దెబ్బతిందని ఆరోపించారు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాలు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని కూడా సోనియా గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువతను దేశ భవిష్యత్తుగా చూడాల్సింది పోయి దేశద్రోహులుగా చూస్తున్నారని ధ్వజమెత్తారు. జులై 20వ తేదీన విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటన కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యవేక్షణలోనే జరిగిందని ఆరోపించారు. అలాగే మోదీ హయాంలో పాఠశాల విద్యకు 50 శాతం, ఉన్నత విద్యకు 33 శాతం మేర బడ్జెట్ తగ్గించారని సోనియా గాంధీ దుయ్యబట్టారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయాల్సిన సమయంలో మోదీ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సోనియాగాంధీ ఆగ్రహించారు.

## మకరధ్వజ్ గేట్ వద్ద విపక్ష ఎంపిల ఆందోళన

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విపక్షాల డిమాండ్**

**న్యూఢిల్లీ, జూలై 24 :** నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటు చేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారి తీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. ఈ అంశంపై చర్చకు ముందుగా మంత్రి ప్రధాన్ తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. 'ప్రధాన్‌ను తొలగించాలి' అనే బ్యానర్లతో నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం పార్లమెంట్‌ను కుదిపేస్తోంది. వరుసగా ఐదో రోజు శుక్రవారం పార్లమెంట్‌లోని 'మకర్ ద్వార్' వద్ద ఇండియా కూటమి ఎంపీలు నిరసన ప్రదర్శన కొనసాగించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, లేదా ఆయనను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని విపక్ష ఎంపీలు ప్లకార్డులు చేతబూని నినాదాలతో హోరెత్తించారు. గురువారం మకర్ ద్వార్ వద్ద అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు పరస్పర నిరసనలతో ఎదురెదురుగా నిలబడి ఆందోళన చేపట్టడం ఉద్రిక్తతకు దారితీసింది. చర్చను ప్రతిపక్షాలే అడ్డుకుంటున్నాయని ఎన్డీఏ ఆరోపిస్తుండగా, విద్యాశాఖ మంత్రి రాజీనామాకే విపక్షాలు పట్టుబడుతున్నాయి. నీట్ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి వీడియో సందేశం విడుదల చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు.

## సిజెపి ఆందోళలను ఆసరగా దుష్ప్రచారాలు

**ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ ఇలాంటివే ప్రచారం**

**480కి పైగా సోషల్ మీడియా ఖాతాలు గుర్తించిన పోలీసులు**

**న్యూఢిల్లీ, జూలై 24 :** ప్రస్తుత సీజేపీ ఆందోళనల నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన 480కి పైగా సోషల్ మీడియా ఖాతాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు. ఈ ఖాతాల ద్వారా వదంతులు, నకిలీ పోస్టులు, ఎడిట్ చేసిన వీడియోలను వ్యాప్తి చేసి విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఈ ఖాతాలను గుర్తించి బ్లాక్ చేసే పక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. తాజాగా గుర్తించిన ఈ ఖాతాల ద్వారా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో కూడా తప్పుడు సమాచారం ప్రచారమైందని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా, అధికారిక వర్గాల ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుంచి సోషల్ మీడియాలో వైరల్ అయిన కనీసం 18 తప్పుడు ప్రచారాలను ఇప్పటికే ఖండించామని తెలిపారు. నిరసనకారులపై పోలీసులు దాడి చేశారని, ఓ బాలిక మరణించిందని, కొందరు నాయకులను అదుపులోకి తీసుకున్నారని, గోళీలు లేదా మేకులు అమర్చిన లాఠీలు వాడారని వచ్చిన ప్రచారాలు వాస్తవం కాదని పోలీసులు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలు, వీడియోలు లేదా పోస్టులను నిజానిజాలు తెలుసుకోకుండా ఫార్వర్డ్ చేయొద్దని, ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం సృష్టించడం లేదా ప్రచారం చేయడం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని హెచ్చరించారు.

## నీట్ ఆన్‌లైన్ టెస్ట్ కోసం ఏం చేస్తున్నారు?

**ఎన్టీఏ, కేంద్రానికి సుప్రీం ప్రశ్నలు**

**న్యూఢిల్లీ, జూలై 24 :** నీట్ పరీక్ష చుట్టూ చోటుచేసుకున్న తప్పిదాలకు కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ముగింపు పలకాలని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఇలాంటి ఘటనలు ఇక మీదట కొనసాగకూడదని పేర్కొంది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)కి కీలక ఆదేశాలు జారీ చేసింది. పేపర్ లీక్ తర్వాత చేపట్టిన సంస్కరణలపై అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. "పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కేంద్రం చేపట్టిన చర్యలను మేం దగ్గర్నుంచి సమీక్షించాలనుకుంటున్నాం. భవిష్యత్తులో నీట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని చెప్పారు. మరి అందుకోసం మీరు ఎలాంటి మార్పులు చేస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ, డేటా భద్రత కోసం పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నారా? ఇవన్నీ మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఈ సంస్కరణలకు సంబంధించి వివరణాత్మక అఫిడవిట్లు దాఖలు చేయండి" అని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనికి కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. "విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రం ఎంతదూరమైనా వెళ్తుంది. ఇప్పటికే ఇందుకోసం అనేక చర్యలు చేపట్టాం. ఆ వివరాలను సమగ్రంగా న్యాయస్థానానికి అందిస్తాం. అయితే, దానికోసం కొంత గడువు కల్పించాలి" అని ధర్మాసనాన్ని కోరారు. దీనికి న్యాయస్థానం అంగీకరించింది. ఈ కేసు తదుపరి విచారణను జులై 27కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటిలోగా కేంద్రం, ఎన్టీఏ తమ అఫిడవిట్లు దాఖలు చేయాలని స్పష్టం చేసింది.



## ఘనంగా సుదర్శన నరసింహ హోమం

**కూకట్ పల్లి,జూలై 24 (జనంవార్త) :** కుత్బుల్లాపూర్ శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవాలయంలో వాసుదేవ పీఠం ఆధ్వర్యంలో సుదర్శన నరసింహ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సుదర్శన నరసింహ హోమంలో స్థానిక భక్తులు యువకులు భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన ఆర్చకులు మాట్లాడుతూ సకల గ్రహదోషల నివారణార్థం, సర్వకార్య సిద్ధి కోసం, సకలారిష్ట నివారణార్థం, దుష్ట భయ దోష నివారణార్థం సుదర్శన నరసింహ హోమం నిర్వహించామన్నారు. ఈ మహా పుణ్యకార్యక్రమంలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని,సుదర్శన నరసింహ స్వామివారి పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు నరసింహస్వామి వారి రక్ష కంకణాలు, ముద్రికలు అందజేశామన్నారు. ఈ సుదర్శన నరసింహ హోమంలో భారీ సంఖ్యలో మహిళలు, స్థానిక భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన
## మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ



**మేడ్చల్, జనం వార్త ప్రతినిధి:** జూలై 24తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మేడ్చల్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందువులకు పవిత్రమైన ఆషాఢ తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. శ్రీ మహా విష్ణువు కటాక్షంతో తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. అలాగే మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్, ఉమ్మడి మేడ్చల్ మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజలందరికీ తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## విద్యాసంస్థల బంద్ విజయవంతం

**నాగర్‌కర్నూల్, జనం వార్త ప్రతినిధి:** ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి పిలుపు మేరకు, నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌లో భాగంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గం లోని పాఠశాలలు, కళాశాలల్లో ఎన్ఎస్‌యూఐ నాయకులు విజయవంతంగా బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎన్ఎస్‌యూఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పల్లె అభిషేక్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సిద్ధూ బహదూర్, శివప్రసాద్, పత్తి శ్రీకాంత్, స్వస్తిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యాసంస్థల బంద్ విజయవంతం

**రంగారెడ్డి ప్రతినిధి, జూలై 24:** బడంగ్ పేట డివిజన్లో పాలిటెక్నిక్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల బందు విజయవంతంగా నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ పి వై ఎల్ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో తెలిపారు. శుక్రవారం నాడు జరిగిన బంద్, కార్యక్రమంలో బాలాపూర్ , మీర్ పేట నాదర్గుల్, లలో బందు విజయవంతం అయ్యిందని ఎస్ఎఫ్ఐ బాలాపూర్ మండల అధ్యక్షులు, అరవింద్ కుమార్, మండల కార్యదర్శి దాసరి అరవింద్ అన్నారు, నీట్ పరీక్షల నిర్వహణలో చోటు చేసుకున్న లోపాలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని వారి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పి వై ఎల్ ) గ్రేటర్ హైదరాబాద్ కొల్లూరు భీమేష్ మాట్లాడుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నిరసన లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసమరించుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో నీటితో పాటు ప్రభుత్వం నిర్వహించే అన్ని పోటీ పరీక్షలను ఎలాంటి లీకేజీలకు అవకాశం లేకుండా పారదర్శకంగా పటిష్టమైన భద్రతా చర్యలతో నిర్వహించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పిఓఎల్ నాయకులు దాసరి అఖిల్ కిరణ్ మనోహర్ అక్కి శివ పెద్ద సంఖ్యలో పాలిటెక్నిక్ డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.



## యూటర్న్ సమస్యకు పరిష్కారం

### రాఘవేంద్ర హోటల్ ముందు ఏర్పాటు
### హర్షం వ్యక్తం చేసిన స్థానికులు



**నాగారం, జూలై 24 (జనం వార్త) :** వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యను దృష్టిలో పెట్టుకొని రాఘవేంద్ర హోటల్ ఎదురుగా యూ-టర్న్ ఏర్పాటు చేయడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదని కాంగ్రెస్ పార్టీ నాగారం డివిజన్ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని శిల్పా నగర్ సమీపంలో ఉన్న పలు కాలనీవాసుల వాహనాదారులకు యూటర్న్ సమస్య తలనొప్పిగా మారింది. ఈ సందర్భంగా వాహనదారుల యూ-టర్న్ సమస్య పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని జేఏసీ టీమ్ సభ్యులు,పలు పార్టీ నాయకులు ముప్పు శ్రీనివాస్ రెడ్డితో కలిసి ముందుకు వచ్చి శుక్రవారం ట్రాఫిక్ సిఐని కలిశారు. అనంతరం వాహనాదారుల యూటర్న్ సమస్యను కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ట్రాఫిక్ ఏసీపీ సుబ్బయ్యకు వాహనాదారుల యూటర్న్ సమస్యను ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి మాట్లాడుతూ నాగారం రాఘవేంద్ర హోటల్ ముందు నుండి భారీ వాహనాలు కాకుండా ద్వితీయ వాహనాలకు,ఆటోలకు, కారుల కోసం యూ-టర్న్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడూరు అశోక్ గౌడ్,మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు,ర్యాల అశోక్ యాదవ్,సతీష్ గౌడ్,చక్రపాణి గౌడ్, మాజీ వార్డు సభ్యులు సాయినాథ్ గౌడ్,పంగ సంతోష్,బాలు యాదవ్ శ్రీహరి,కొండల్ రెడ్డి, బిజెపి నాయకులు జంగారెడ్డి,జేఏసి టీం సభ్యులు జయకుమార్, జితేందర్ రెడ్డి,విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీ రామారావు
# 50వ పుట్టినరోజు వేడులు

### సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులు : ప్రదీప్ రావు



**ములుగు జిల్లా, జులై 24 :** తెలంగాణ రాష్ట్ర సాధకుడు తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) తనయుడు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి సిరిసిల్ల శాసనసభ్యులు కేటీ రామారావు 50వ పుట్టినరోజును పురస్కరించుకుని ములుగు జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదిఫ్ రావు ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలో శుక్రవారం సేవా కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలం నుండి కేటీఆర్ నాయకత్వం బీఆర్ఎస్ పార్టీ తొమ్మిన్నర సంవత్సరాల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా సంక్షేమ బాటలో విరాజిల్లిన విషయాన్ని ఈ నాయకులు గుర్తుచేశారు. బి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పాలనలో సబ్బండ వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ తన జన్మదిన వేడుకలో కేక్ కటింగ్‌లు శాలువాలు ఆర్భాటాలకు దూరంగా ఉండి... కేవలం పేద ప్రజలకు సేవ చేసే కార్యక్రమాలు మాత్రమే నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ శ్రేణులు ఈ సేవా కార్యక్రమాలను చేపట్టాడం జరిగింది. ఏటూరునాగారం సామాజిక ఏరియా ఆసుపత్రిని సందర్శించి బాలింతలకు పండ్లు బ్రెడ్‌లను పంపిణీ చేశారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు యువత ఉత్సాహంగా పాల్గొనేలా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి 20 మంది రక్తదానాన్ని అందించడం జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జి.యు.పి.ఎస్) లో పేద విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనం తాడూరి రఘు వండించి ప్రేమతో వడ్డించారు. కే టీ రామారావు మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ ఈ రాష్ట్రానికి దేశానికి సేవ చేయాలని యువతకు నిరుద్యోగులకు రైతులకి సబ్బండ వర్గాలకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని భగవంతుని ప్రార్థించారు. రాష్ట్ర అభివృద్ధిలో వారు ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు,కోనేరు నగేష్ (ఎక్స్ ఎంపీపీ),సప్పిడి వెంకట్రాం నరసయ్య, తాడూరి రఘు, దడిగాల సమ్మయ్య, దన్నపునేని కిరణ్, పర్వతాల ఎల్లయ్య (ఉపసర్పంచ్), కుమ్మరి చంద్రబాబు, మాధురి రాంబాబు, గండేపల్లి నరసయ్య, వావిలాల పోశయ్య, మాదరి చంద్రమౌళి, ముంజ రాజేందర్, పూజారి రాధాకృష్ణ, ఖాతా యాదగిరి, వావిలాల ముత్తయ్య, ఎర్రళ్ల సారయ్య, గారే ఆనంద్, దొడ్డ కృష్ణ, అంగాల వీరన్న, బట్టు గోపి, ఎంపెల్లి రాజు, కొండాయి చిన్ని, మాదరి మధు, ఎండి బాబా, గంప సాయి కిరణ్, కాళ్ల రామకృష్ణ, మెరుగు వెంకటేశ్వర్లు, తాళ్ల పెల్లి మోహన్, కోడం బిక్షపతి, మెరుగు రఘు, పళ్ళ సత్యం, వావిలాల కిషోర్, రామటెంకి రాజకుమార్,బట్టు రమేష్, పెంచికల లక్ష్మీనారాయణ, మందపల్లి చంద్రం, నర్సింగ్ రావు, గద్దల శ్రీరామ్, కబ్బాక రామన్న, సూది లక్ష్మీనరసు నారా ప్రశాంత్ గంటా సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అధికారులు క్షేత్రస్థాయిలో
# పర్యటనలు కొనసాగించాలి

### భారతీయ జనతా పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్



**రంగారెడ్డి ప్రతినిధి జూలై 24 :** అధికారులు సీట్లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి-ంలో పర్యటించి ప్రజల కష్టాలను గుర్తించాలని భారతీయ జనతా పార్టీ మహేశ్వరం నియోజక వర్గం ఇన్చార్జి అందేల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ నడికుడి యాదగిరి ఆధ్వర్యంలో బడంగ్ పేట సర్కిల్ లోని ఏజిఆర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ప్రధాన రహదారి సమస్య డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. అందెల శ్రీరాములు యాదవ్ ఈ కార్య క్రమానికి విచ్చేసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకు న్నా స్పందన లేకపోవడం చేతకానితనానికి నిదర్శనమని ప్రజలకు అందుబాటులో ఉండవలసిన అధికారులు కార్యాల యాలకే పరిమితం కావడం దురదృష్టకరమైన దుయ్యబట్టారు. మౌంట్ కార్మెల్ విద్యార్థులు సైకిళ్లపై వస్తు బురదలో దారి పడుతున్న పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి అధ్యక్షులు వీర కర్ణ రెడ్డి కిసాన్ మోర్చా నాయకులు ఏనుగు రామ్ రెడ్డి యువమోర్చా నాయకులు రామిడిశూరకర్ణ రెడ్డి నాయకులు కాలనీవాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్‌టీఏలో 47మంది అధికారులు తొలగింపు

**ఢిల్లీ:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశ వ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జేఈఈ, నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(టీూ)లో భారీ ప్రక్షాళన చేపట్టింది. పరీక్ష పత్రాల లీకేజీతో ఈ ఏజెన్సీ పదే పదే వివాదాల్లోకి రావడంతో అందుకు కారకులుగా గుర్తించిన 47 మంది అధికారులను సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో పలువురిపై లీగల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ఈ చర్యను ఎన్‌టీఏ ప్రక్షాళనలో తొలి అడుగుగా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. లీకులకు అస్కారం లేకుండా నిపుణుల కమిటీ సూచనల మేరకు ఔట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.



## ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి

### ఆగస్టు 30 నాటికి విద్యార్థులందరికీ రెండు జతల యూనిఫాంలు : సీఎస్ సంజయ్ జాజు

**ములుగు, జూలై 24 :** రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జూలై 27--29 వరకు రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. యూనిఫాంల తయారీ, నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. వీడి యో కాన్ఫరెన్స్ అనంతరం ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, యూనిఫాంల పంపిణీని గడువులో పూర్తి చేయడంతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.



## విద్యార్థులపై లాఠీచార్జికి నిరసనగా ర్యాలీ

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు

**ములుగు జిల్లా, జులై 24 :** మండల కేంద్రంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టు విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ నిర్వహించిన శాంతియుత నిరసన ర్యాలీలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలుభారీగా పాల్గొన్నారు. చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య జిల్లా ఆర్ టి ఐ హ్యూమన్ రైట్స్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి మంగపేట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాడిషా ఆదినారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న రాహుల్ గాంధీ ముఖ్యంగా పేద మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నారని తెలిపారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ అమాయక విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని విద్యార్థులపై లాఠీచార్జి చేయడం విద్యార్థులనే దోషులుగా చిత్రీకరించడం అత్యంత అమానుషం ఖండనీయమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ నిర్వహించిన ఈ శాంతియుత నిరసన ర్యాలీలో జిల్లా నాయకులు బ్లాక్ కాంగ్రెస్ నాయకులు జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



## మానుకోటలో కేటీఆర్ జన్మదిన వేడుకలు

**మహబూబాబాద్, జూలై 24:** బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో బి.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వ హించారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకుడు డాక్టర్. రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూబి.ఆర్.పార్టీ పరిపాలనా కాలం లో రాష్ట్రం లో అభివృద్ధి చెందిందని , నేడు రాష్ట్రం లోని ప్రజలంతా నిరాశ.. నిస్పృహల తో ఉన్నారని , ఎస్సారెస్పీ ద్వారా సాగు నీరు అందక రైతాంగం ఇబ్బందులు పడుతుంటే , కేసిఆర్ కాలేశ్వరం ను ప్రాజెక్టు నిర్మించాలని , రాష్ట్ర ప్రభుత్వం కాలేశ్వరం నుంచి నీటిని విడుదల చేయకుండా రాజకీయాలు చేస్తున్నారని , రాజకీయాలను పక్కనపెట్టి వెంటనే కాళేశ్వరం నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో బి.ఆర్.పార్టీ కి చెందిన పలువురు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెస్ చార్జీలను
# వెంటనే విడుదల చేయాలి

### బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు అరవింద్ చారి

**నాగర్‌కర్నూల్, జనం వార్త ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ని పట్టణ కేంద్రంలో బిసి బాయ్స్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ను శుక్రవారం రోజున బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి సందర్శించారు. సందర్శనలో భాగంగా ఈరోజు మెనూ గమనించారు. దానిలో భాగంగా విద్యార్థుల తో బీసీ వసతి గృహ బాలుర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే వంటలు చేసే ఆయాలతో హాస్టల్ యొక్క స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి మాట్లాడుతూ విద్యార్థులకు నూతన భవనాలు లేకపోవడం వలన మౌలిక వసతులు లేకపోవడం జరుగుతుందని అన్నారు. అలాగే ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్నటువంటి మెస్ చార్జీలు ప్రభుత్వం విడుదల చేస్తే మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించే వె సులుబాటు ఉంటుందని అన్నారు. అలాగే హాస్టల్ కాళీగా ఉన్న సిబ్బందిని త్వరితగతిన భర్తీ చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు. జిల్లా అధికార యంత్రాంగం బీసీ వసతి గృహ సంక్షేమ హాస్టల్లను సందర్శించి విద్యార్థుల స్థితిగతులను తెలుసుకొని వారికి తగిన న్యాయం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు ధన్నోజు అరవింద్ చారి అన్నారు. ఈ సమావేశంలో హాస్టల్ విద్యార్థులు మరియు ఆయాలు పాల్గొన్నారు.



# విరిగిపడ్డ కొండచరియలు

## 13 మంది మృతి

**లాహౌల్-స్పితి :** హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లాహౌల్-స్పితి జిల్లాలో ఓ వాహనంపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. పంగీ-కిలాద్ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కుల్లు నుంచి పంగీ వైపు వెళ్తోన్న టాటా సుమోపై ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వాహనం వెనుక భాగంలో మంటలు తలెత్తాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం సమయంలో వాహనంలో 15 మంది వరకు ఉన్నట్లు సమాచారం. పెద్ద పెద్ద బండరాళ్లు పడటంతో వాహనం నుజ్జునుజ్జయింది. పంగీ-కిలాద్ రోడ్డులో గురువారం కూడా కొండచరియలు విరిగిపడటంతో ఈ మార్గాన్ని మూసివేశారు. మరమ్మతుల అనంతరం ఈ ఉదయమే రాకపోకలను పునరుద్ధరించారు. ఈ క్రమంలోనే నేడు మళ్లీ కొండచరియలు విరగడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. వాహన శిథిలాల కింద తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని కాపాడి ఆసుపత్రికి తరలించారు.



# పదవుల కోసం జనసేన ఏర్పాటు చేయలేదు

- రాష్ట్ర అభివృద్ధి కోసమే పవన్ పార్టీ ఏర్పాటు
- ఎపిని విభజించి నిధులు ఇవ్వకుండా అన్యాయం చేశారు
- పార్టీలో గ్రూపులు లేవు.. ఉన్నదంతా పవన్ కళ్యాణ్ గ్రూపు మాత్రమే
- స్వార్థ రాజకీయాలకు జనసేన దూరం.. అలాంటివి ప్రోత్సహించదు
- కార్యకర్తలే మన పత్రికలు, ఛానళ్లు కూడా
- విజయవాడ జనసేన పార్టీ నేతల సమీక్షా సమావేశంలో నాదెండ్ల మనోహర్

**విజయవాడ, జూలై 24 :** జనసేన పార్టీ బలోపేతం కోసం ఎంతోమంది పని చేస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర హితం కోసం కూటమి ధర్మానికి కట్టుబడి అందరూ కలిసి పని చేశారని చెప్పారు. జనసేన.. ఏనాడు స్వార్థ రాజకీయాలను ప్రోత్సహించలేదని.. ఆ ఆలోచన కూడా చేయలేదని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పని చేసే వారిని గుర్తించి ప్రోత్సహిస్తామని అన్నారు. అంతా కలిసి కట్టుగా ఉండటం వల్లే ఈ ప్రస్థానం కొనసాగిస్తున్నామన్నారు. శుక్రవారం విజయవాడలోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల జనసేన నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రాన్ని విభజించి ఏపీకి అవసరమైన నిధులు ఇవ్వకుండా అన్యాయం చేశారని విమర్శించారు. పవన్ కల్యాణ్ పదవుల కోసం జనసేన ఏర్పాటు చేయలేదని.. యువతను, మహిళలను చైతన్యపరిచేలా జనసేన పార్టీ తొలి అడుగులు వేసిందన్నారు. విజయవాడ నగరం ఉద్యమాల గడ్డ అని.. రాజకీయ చైతన్యానికి మరోపేరని మంత్రి అన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయవాడ నాయకులకు గుర్తింపు ఉండేదన్నారు. మూడు రాజధానులని వైసీపీ అధినేత జగన్ రెడ్డి ప్రకటిస్తే.. జనసేన ఉద్యమం చేసిందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన పార్టీ జనసేన అని తెలిపారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి చాలా మంది భయపడ్డారని.. జనసేనలో వీర మహిళలు, జన సైనికులు ధైర్యంగా నిలబడ్డారన్నారు. విజయవాడ కార్పొరేషన్‌లో 34 స్థానాల్లో నిలబడ్డారని.. క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొని నిలబడిన తీరు ఆదర్శమని కొనియాడారు. పార్టీలో ఉన్న కార్యకర్తల మాట నాయకులు వినాలని.. ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరూ నోరు జారవద్దని, అనవసర రాద్ధాంతాలు చేయవద్దని సూచించారు. జనసేనలో మరో గ్రూపు లేదని... ఎవరైనా పవన్ కల్యాణ్ గ్రూపే అని చెప్పుకొచ్చారు. 'కూటమిలో మనం ఉన్నాం.. కలిసికట్టుగా పనిచేయాలి. అభిప్రాయబేధాలు ఉంటే కూర్చుని, చర్చించి పరిష్కరించుకోండి. జనసేన సభ్యత్వం నమోదులో కీలకంగా చాలా మంది పని చేశారు. జనవాణి ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో జనవాణిని నిర్వహించాలి. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాన్ని బలంగా తిప్పి కొట్టాలి. మనకు పత్రికలు, ఛానళ్లు లేవు.. కార్యకర్తలే మన మీడియా. పవన్ ఆలోచనలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి' అంటూ పిలుపునిచ్చారు. నేడు పంచాయతీ రాజ్ శాఖను దేశంలోనే రెండో స్థానంలో పవన్ కల్యాణ్ నిలబెట్టారని మంత్రి తెలిపారు. విజయవాడలోని 64 డివిజన్లలో జనసేన బలోపేతం కావాలన్నారు. కేవలం బీఫాం తెచ్చుకుని నిలబడితే గెలుపు రాదని.. కూటమిలో ఉన్నాం కాబట్టి అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. ఎక్కడ జనసేన సీట్లు తీసుకోవాలి, ఎక్కడ పోటీ చేయాలనేది అధినేత పవన్ కల్యాణ్ అంతిమంగా నిర్ణయిస్తారన్నారు. అన్ని ప్రాంతాల్లో త్వరలోనే జనసేనాని కమిటీలను ప్రకటిస్తారన్నారు. గతంలో జనసేనకు వచ్చిన ఓట్లు, సీట్లను పరిశీలించి.. కొత్త ప్రణాళికతో ముందుకు సాగాలని నేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్దేశించారు. జనసేన పార్టీ కోసం గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు సొంతంగా పనిచేశారని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర బాగు కోసం కూటమి విజయం సాధించాలని అందరం కలిసి పని చేశామని చెప్పారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం అంతా సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మిత్రపక్ష పార్టీల నేతలను కలుపుకుని ముందుకు సాగాలని నేతలకు సూచించారు. పార్టీ కోసం పని చేసే వారిని జనసేన అధినేత పవన్ కల్యాణ్ గుర్తించి ప్రోత్సహిస్తారని మంత్రి తెలిపారు. జనసేన పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లేలా పని చేయాలని అన్నారు. జనసేన పార్టీ బలం పెంచుకోవడం ద్వారా ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. నేడు జనసేనలో ఎంతోమంది సామాన్య కార్యకర్తగా పని చేసి వివిధ హోదాలు సంపాదించారన్నారు. రాష్ట్రంలో వైసీపీ వంటి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేలా అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ కార్పొరేషన్‌లో కూటమి పార్టీ విజయకేతనం ఎగురవేయాలని కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యే బొలిశెట్టి , సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, రావి సౌజన్యతో పాటు విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# సీజేపీ ఆందోళనలపై ఎలాంటి పిటిషన్లు లేవు

- వాటిని విచారించకుండా తిరస్కరించారని ఎలా రాస్తారు?
- మీడియా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన చీఫ్ జస్టిస్



**న్యూఢిల్లీ, జూలై 24 :** 'చలో పార్లమెంట్' నిరసనల సందర్భంగా పోలీసుల తీరుపై అత్యవసర పిటిషన్ దాఖలు కాగా.. విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించిందన్న వార్తలను సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు కథనాలని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఆందోళనలపై అసలు పిటిషనే దాఖలు కాలేదని అన్నారు. గత రెండు రోజులుగా మీడియా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. అత్యవసర పిటిషన్‌ను సీజేఐ విచారణకు స్వీకరించలేదని తప్పుడు వార్తలు ప్రసారం చేస్తోందన్నారు. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన తర్వాత న్యాయవాదులు తమ కేసులను అత్యవసరంగా స్వీకరించాలని విజ్ఞప్తి చేసిన సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు సీజేపీ ఆందోళనలకు సంబంధించి ఒక్క పిటిషన్ కూడా దాఖలు కాలేదు. ఈ అంశంపై విచారణ చేపట్టాలని ఎవరో ఒక లాయర్ మాత్రం విజ్ఞప్తి చేశారు. ఓ అభ్యర్థనను పిటిషన్‌గా ఎలా స్వీకరిస్తాం అని సీజేఐ అన్నారు. జులై 20న సీజేపీ చేపట్టిన చలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో అత్యవసరంగా విచారణ చేపట్టాలని న్యాయవాది నరేంద్ర మిశ్రా బుధవారం సుప్రీం కోర్టును అభ్యర్థించారు. పోలీసు దాడులకు సంబంధించి తన వద్ద వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆందోళనకారుల్లో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని, వారి కోసమైనా అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అయితే, సుప్రీం కోర్టు అందుకు తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని, అలాగే పిటిషనర్ కూడా సమయం వృథా చేసుకోవద్దని సీజేఐ హితవు పలికినట్లు రాసుకొచ్చాయి. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..' మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ అన్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. మరోవైపు, కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై సుప్రీం కోర్టు నిషేధం విధించింది. ఒక వేళ పోస్టు చేయాలనుకుంటే సుప్రీం కోర్టు లేదా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్స్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. కోర్టు కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం వల్ల దుర్వినియోగమవుతున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వికాస్ సింగ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా అంగీకరించారు. నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ముందస్తు చర్యల్లో భాగంగా నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం
- విద్యార్థులపై కేసులను ఎత్తివేయాల్సిందే
- కేంద్రమంత్రులకు తేల్చి చెప్పిన సిజెపి ప్రతినిధులు



**న్యూఢిల్లీ, జూలై 24 :** నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత తీసుకోవాలంటూ పట్టుబడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు కొందరు కేంద్ర మంత్రి జేపీ నడ్డా, జితేందర్ సింగ్‌లతో శుక్రవారం సమావేశమయ్యారు. నీట్ సహా విద్యా వ్యవస్థలో కీలక అంశాలపై చర్చించారు. దాదాపు గంటన్నర పాటు ఈ చర్చలు జరిగాయి. తమ డిమాండ్లను సీజేపీ లిఖితపూర్వకంగా ప్రభుత్వం ముందుంచింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు కేంద్ర మంత్రులు స్పందిస్తూ తమకు ఒక రోజు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో, రేపు మరోసారి భేటీ అయ్యేందుకు ఇరు వర్గాలు నిర్ణయించాయి. కేంద్రం మంత్రులతో సమావేశం అనంతరం సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. కేంద్రం ముందు 3 ప్రధాన డిమాండ్లు పెట్టామని సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ తెలిపారు. మూడింట్లో రెండు డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా ఉందని అన్నారు. విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని తాము కోరినట్టు చెప్పారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సంబంధించి రేపటి వరకు కేంద్రం గడువు కోరిందని సౌరభ్ దాస్ చెప్పారు. కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధుల మధ్య చర్చలు ముగిశాయి. ఇందులో భాగంగా కేంద్రం ముందు సీజేపీ మూడు ప్రధాన డిమాండ్లను ఉంచింది. ధర్మేంద్ర ప్రధాన్ (రాజీనామా, పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం, విద్యార్థులపై కేసులు ఎత్తివేయడం వంటి డిమాండ్లు చేసినట్లు సీజేపీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన్ రాజీనామా తప్ప మిగతా రెండు డిమాండ్లకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌పై రేపు మధ్యాహ్నం వరకు ప్రభుత్వం సమయం కోరిందని పేర్కొన్నారు. త్వరలోనే ఆయనను పదవి నుంచి తొలగిస్తుందని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 2గంటలపాటు జరిగిన ఈ సమావేశానికి కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ హాజరుకాగా.. సీజేపీ తరఫున పార్టీ జాతీయ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా వెళ్లారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి రాజీనామా తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని సీజేపీ డిమాండ్ చేసింది. అది నెరవేరకపోతే ఉద్యమం మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది. ప్రధాన్ వైదొలిగే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని పునరుద్ఘాటించింది.

# బడ్జెట్‌లో విద్యావ్యవస్థ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు

## కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు, జూలై 24 :** రాష్ట్ర బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లను విద్యావ్యవస్థ కోసం ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన గుంటూరులో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం లీప్ యాప్‌ను రూపొందించింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని అత్యధిక మార్కులు సాధించిన వారి ఫొటోలతో పేపర్‌లో యాడ్స్ వేశాం. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దాలి. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో జైల్లో ఉన్న 11 మంది నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. . కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల తప్పు చేసేవారికి భయం ఉండటం లేదు. ఒక వ్యక్తి రాజీనామా చేయడం వల్ల వ్యవస్థలో మార్పులు రావు. ఎక్కడో ఒక చోట తప్పు జరిగినప్పుడు రాజీనామా చేయాలంటే పనిచేయడానికి మంత్రులు ఉండరు. అలాంటి ఘటనలపై తీసుకోవాల్సిన సంస్కరణలను తెలిపితే, చర్చించి అమలు చేసేందుకు చర్యలు చేపడతాం'అని పెమ్మసాని అన్నారు.


# అమెరికాలో రోడ్డు ప్రమాదం

## నిర్మల్ జిల్లా వాసి దుర్మరణం

**నిర్మల్, జూలై 24 :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన నిత్యానంద రెడ్డి (24) చికిత్స పొందుతూ మృతి చెందారు. మిషిగన్ రాష్ట్రంలోని డెట్రాయిట్‌లో ఉంటున్న నిత్యానందరెడ్డి ఈనెల 18న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన అతడిని స్నేహితులు ఆసుపత్రిలో చేర్పించారు. జులై 23న నిత్యానందరెడ్డి పుట్టినరోజు కావడంతో అతని స్నేహితులు ఆసుపత్రి బెడ్ పైనే పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కాసేపటి తర్వాత పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పుట్టినరోజు నాడే కన్నుమూయడంతో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మూడేళ్ల క్రితం ఎమ్మెస్ చేసేందుకు యూఎస్ వెళ్లిన నిత్యానందరెడ్డి ఇటీవలే ఉద్యోగంలో చేరినట్లు తెలిసింది. మృతదేహం త్వరగా వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# 60 దేశాలపై టారిఫ్‌లు విధించిన అమెరికా

## భారత్‌కు స్వల్ప ఊరట



**వాషింగ్టన్ :** వెట్టి చాకిరీ ద్వారా తయారుచేసిన వస్తువుల దిగుమతులపై సరైన నిషేధం అమలు చేయడం లేదనే ఆరోపణలతో అగ్రరాజ్యం అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది. భారత్ సహా దాదాపు 60 భాగస్వామ్య దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తాత్కాలికంగా విధించిన 10 శాతం గ్లోబల్ టారిఫ్‌ల గడువు శుక్రవారంతో ముగియనుండటంతో ట్రేడ్ యాక్ట్ 1974 లోని 'సెక్షన్ 301' ప్రకారం ఈ కఠినమైన సుంకాలను అమల్లోకి తెచ్చారు. ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ.. వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును భారత్ వేగవంతం చేయడంతో ఈ పన్నును 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజ వాయువు, ఎరువుల దిగుమతులకు, అలాగే యూఎస్-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం పరిధిలోకి వచ్చే వస్తువులకు ఈ పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చారు. వివిధ దేశాలు తీసుకుంటున్న చర్యల ఆధారంగా ఈ సుంకాల శాతాన్ని నిర్ణయించారు. భారత్, బ్రిటన్, కెనడా, మెక్సికో, ఇండోనేషియా వంటి దేశాలకు 10 శాతం సుంకాన్ని వర్తింపజేయగా, చైనా సహా ఇతర 38 దేశాలకు 12.5 శాతం సుంకాన్ని ఖరారు చేశారు. ఇక ఈ సుంకాలపై యూఎస్ వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ మాట్లాడుతూ.. అమెరికాలో దాదాపు శతాబ్ద కాలంగా వెట్టిచాకిరిపై నిషేధం ఉందన్నారు. దీన్ని కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ చర్య మానవ హక్కుల ఉల్లంఘనను సరిదిద్దడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా కార్మికుల సంక్షేమాన్ని మెరుగుపరచడానికి తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. అయితే, మునుపటి సుంకాల గడువు ముగిసే సమయానికే సరిగ్గా ఈ కొత్త సుంకాలను తీసుకురావడంపై వస్తున్న విమర్శలను అమెరికా అధికార యంత్రాంగం తోసిపుచ్చింది. ట్రంప్ తన వ్యాపార విధాన లక్ష్యాలను సాధించడానికి తన వద్ద ఉన్న అన్ని సాధనాలను ఎప్పుడూ ఉపయోగిస్తారని తెలిపింది. అందులో సుంకాలు కూడా ఒక భాగమని స్పష్టం చేసింది. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల ప్రకారం ఆయా దేశాలతో కుదుర్చుకున్న గరిష్ఠ సుంకాల పరిమితిని దాటి ఈ నూతన సుంకాలు పెరగవని పేర్కొంది.



# పార్వతీపురం మన్యం జిల్లాకు కుంకీ ఏనుగులు

## మంగళగిరి వద్ద స్వాగతించిన డిప్యూటి సిఎం పవన్

**చిత్తూరు, జూలై 24 :** పలమనేరు ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపు నుంచి జయంత్, అభిమన్యు అనే రెండు కుంకీ ఏనుగులను పార్వతీపురం మన్యం జిల్లాకు అటవీశాఖ అధికారులు తరలిస్తున్నారు. సీతానగరం మండలం గుచ్చిమి వద్ద ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల క్యాంపుకు తరలించనున్నారు. మన్యం జిల్లాకు వెళ్లే మార్గంలో మంగళగిరిలోని డిప్యూటీ సీఎం కార్యాలయం వద్దకు రెండు కుంకీ ఏనుగులు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కుంకీ ఏనుగులకు స్వాగతం పలికి, ఆహారం అందించారు. అనంతరం మన్యం జిల్లా గుచ్చిమి క్యాంపునకు ఏనుగులు పయనమయ్యాయి. గురువారం సాయంత్రమే పార్వతీపురం జిల్లాకు తరలించేందుకు ముసలిమడుగు క్యాంపు నుంచి రెండు కుంకీ ఏనుగులను అటవీ శాఖ అధికారులు లారీల్లో ఎక్కించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో ఏనుగుల తరలింపును చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కొనసాగుతున్న ఏనుగుల దాడులను నియంత్రించేందుకు గుచ్చిమి వద్ద ప్రత్యేక ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ ఎలిఫెంట్ క్యాంపు ఆగస్టు 12న ఏనుగుల దినోత్సవం సందర్భంగా అధికారికంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం కానుంది. కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని అటవీ శాఖ అధికారి చలపతిరావు తెలిపారు. పలమనేరు ప్రాంతంలో ఏనుగుల గుంపును కంట్రోల్ చేసే నేర్పు వీటికి ఉందన్నారు. పలు సందర్భాల్లో వీటి పని తీరుతో పంటలను కాపాడాయని చెప్పుకొచ్చారు. గతంలోనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కర్ణాటక ప్రభుత్వంతో ఈ కుంకీ ఏనుగులపై ఒప్పందం చేసుకున్నారని అన్నారు. 16 నెలల అభిమన్యుని ఏపీకి కర్ణాటక ప్రభుత్వం కానుకగా ఇచ్చిందన్నారు. ఇప్పుడు జయంత్, అభిమన్యుల ద్వారా మన్యం ప్రాంతంలో కూడా ఏనుగుల గుంపును నిలువరిస్తామని తెలిపారు. ఆ ప్రాంతంలో ప్రజలకు, పొలాలకు రక్షణగా కుంకీ ఏనుగులు నిలుస్తాయని చలపతిరావు వెల్లడించారు.

# అన్ని దేశాల్లో మితిమీరిన వాచ్ ఔషధాల వినియోగం




**న్యూఢిల్లీ :** యాంటీబయాటిక్స్‌ను మితిమీరి వినియోగించడంలో దాదాపుగా అన్ని దేశాల్లోనూ ఒకే పోకడ ఉందని తాజా అధ్యయనం తేల్చింది. 'వాచ్' శ్రేణి యాంటీబయాటిక్స్‌ను ప్రతి చిన్న అవసరానికీ వాడేస్తున్నారని పేర్కొంది. ఈ అధ్యయన వివరాలు ప్రముఖ వైద్య పత్రిక 'ద లాన్సెట్'లో ప్రచురితమయ్యాయి. 'వాచ్' శ్రేణిలో చాలా శక్తిమంతమైన ఔషధాలు ఉంటాయి. సాధారణ యాంటీబయాటిక్స్ ఏ మాత్రం పనిచేయని పరిస్థితుల్లో రోగుల ప్రాణాలు కాపాడేందుకు మాత్రమే వీటిని వాడాలి. మొదట వాడాల్సిన వాటిని 'యాక్సెస్' విభాగంగా వర్గీకరించారు. మందులకు లొంగని మొండి, ప్రమాదకరమైన ఇన్‌ఫెక్షన్లపై పోరుకు.. చివరి ప్రయత్నంగా 'రిజర్వ్' విభాగం యాంటీబయాటిక్ మందులను వాడాలి. 2019లో ప్రపంచవ్యాప్తంగా బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ల చికిత్సకు 430 కోట్ల యాంటీబయాటిక్ కోర్సులు అవసరమని పరిశోధకులు లెక్కించారు. అందులో 77 శాతం కేసుల్లో 'యాక్సెస్' విభాగం మందులను వాడాల్సిందని విశ్లేషించారు. అయితే ఐక్యూవీఐఏ మిడాస్ డేటాబేస్‌ను విశ్లేషించినప్పుడు నాలుగింట మూడొంతుల దేశాలు అవసరమైన దానికన్నా ఎక్కువగా యాంటీబయాటిక్స్‌ను వాడినట్లు తేల్చారు.

# విమానయాన సేవల్లోకి అదానీ గ్రూప్

### స్పష్టతనిచ్చిన సంస్థ




**న్యూఢిల్లీ :** గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ కొత్తగా విమానయాన సేవల్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి. వీటిపై ఆ సంస్థ క్లారిటీ ఇచ్చింది. ఆ కథనాలు, మార్కెట్ ఊహాగానాలు నిరాధారమైనవని, అవాస్తమని అదానీ గ్రూప్ ప్రకటించింది. విమానయాన రంగంలోకి ప్రవేశించడానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఏ ప్రతిపాదననూ పరిశీలించడం లేదని స్పష్టతనిచ్చింది. ముంబయి, దిల్లీ వంటి అత్యధిక రద్దీ ఉండే విమానాశ్రయాలను నిర్వహిస్తున్న కంపెనీలు, షెడ్యూల్డ్ విమానయాన సంస్థలో 10 శాతానికి పైగా వాటా కలిగి ఉండకూడదనే నిబంధనను సవరించాలని ప్రభుత్వాన్ని 'అదానీ గ్రూప్' కోరిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమానికి మద్దతుగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం.. తదుపరి తరం ఏరియల్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఓ ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ నేపథ్యంలోనే అదానీ గ్రూప్ విమానయాన రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఊహాగానాలు వచ్చాయి.






## ఐదో రోజూ నష్టాల్లో సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం భయాలు నెలకొన్నాయి. వృద్ధికి విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు దీనికి తోడయ్యాయి. దీంతో వరుసగా ఐదో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా నిఫ్టీ ఆటో, రియాల్టీ, ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,708.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,391.39) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,474.43 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102.15 పాయింట్ల నష్టంతో 23,767.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97.68 డాలర్ల వద్ద ఉండగా.. బంగారం ఔన్సు 4059 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## తగ్గిన బంగారం, వెండి ధరలు

దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.2 వేలు తగ్గుముఖం పట్టి రూ.1.47 లక్షలకు చేరింది. వెండి సైతం కిలోకు రూ.5 వేలు తగ్గి రూ.2.24 లక్షలకు చేరింది. గరిష్ఠాల వద్ద ట్రేడర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో రెండు లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయని అనలిస్టులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి 10 గ్రాముల పసిడి ధర రూ.1.48 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు 4063 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. వెండి ఔన్సు 58.59 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దేశీయంగా బంగారం కొనుగోళ్లు నెమ్మదించడంతో వీటి ధరలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ పరిణామాలను గమనించినప్పుడు.. ఇరాన్‌పై అమెరికా దాడులు చేస్తుండడంతో క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగాయి. ఆయిల్ ధరల్లో స్థిరత్వం వచ్చి, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ రాబడులు కాస్త తగ్గుముఖం పడితే బంగారం మళ్లీ 4100, వెండి 60 డాలర్లు దాటొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




## ఇంతకంటే సంతోషంగా ఉండలేను

### శ్రేయస్ అయ్యర్

టీమ్ఇండియా టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రేయస్ అయ్యర్ ఏడు మ్యాచ్‌ల తర్వాత గెలుపు రుచి చూశాడు. శ్రేయస్ సారథ్యంలో ఐర్లాండ్, ఇంగ్లాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు.. జింబాబ్వే పర్యటనలో శుభారంభం చేసింది. గురువారం తొలి టీ20లో 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) విధ్వంసం సృష్టించడంతో భారత్ సునాయాసంగా గెలుపొందింది. కెప్టెన్‌గా తొలి విజయం సాధించడంతో శ్రేయస్ అయ్యర్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇంతకంటే సంతోషంగా ఉండలేనంటూ మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ అన్నాడు. "దీని కంటే సంతోషకరమైన విషయం మరొకటి ఉండదు. మా కుర్రాళ్లు అద్భుతంగా రాణించారు. ప్రణాళికలను చక్కగా అమలు పరిచారు. కెప్టెన్‌గా నా మొదటి విజయం అందుకోవడం ఎంతో సంతోషాన్నిస్తోంది. వైభవ్ సూర్యవంశీ నిర్భయంగా ఆడాడు. అతడి ఇన్నింగ్స్ అసాధారణమైనది. గతంలో వైభవ్ ఇక్కడ ఆడాడు. ఇక్కడి పిచ్‌లపై అతడికి మంచి అవగాహన ఉంది. అండర్-19 ఫైనల్‌లో 175 పరుగులు సాధించిన అనుభవం ఉండటంతో మైదానంలోకి అడుగుపెట్టినప్పుడల్లా ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉంటాడు. ఈ మ్యాచ్‌లో అది స్పష్టంగా కనిపించింది. పునరాగమనం చేసిన మయాంక్ యాదవ్ అద్భుతమైన ఆరంభాన్ని అందించాడు. సరైన లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేసి ప్రత్యర్థికి పరుగులు రాబట్టే అవకాశం ఇవ్వలేదు" అని శ్రేయస్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌తో శ్రేయస్ అయ్యర్ అరుదైన రికార్డు అందుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో కెప్టెన్‌గా మొదటి ఎనిమిది మ్యాచ్‌ల్లో టాస్ గెలిచిన తొలి కెప్టెన్‌గా ఘనత సాధించాడు. ఇంతకుముందు ఈ రికార్డు ఎంఎస్ ధోనీ (7), బహామాస్‌కు చెందిన గ్రెగొరీ టేలర్ (7) పేరిట ఉండేది.



## కామన్వెల్త్ గేమ్స్‌లో 100% ఎఫర్ట్ పెట్టను..

### మీరాబాయి చాను

కామన్వెల్త్ గేమ్స్ 2026లో తాను వంద శాతం ఎఫర్ట్ పెట్టనని భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తెలిపింది. సెప్టెంబరు 19 నుంచి ప్రారంభంకానున్న ఆసియా క్రీడలపైనే తన దృష్టంతా అని స్పష్టం చేసింది. ఆ క్రీడల కోసం తన శక్తిని కాపాడుకోవడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆసియా క్రీడల్లో తొలి పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపింది. ఈ సారి కామన్వెల్త్ గేమ్స్‌లో మీరాబాయి చాను 48 కేజీల విభాగంలో బరిలోకి దిగుతోంది. ఆసియా క్రీడలకు రెండునెలల కన్నా తక్కువ సమయమే ఉండటంతో.. రిస్క్ చేయొద్దనే ఉద్దేశంతో 90 కేజీల స్నాచ్‌కు దూరంగా ఉంది. "కామన్వెల్త్ గేమ్స్‌లో నేను నా పూర్తి ప్రయత్నం చేయను. నా దృష్టి అంతా అతి త్వరలో జరగనున్న ఆసియా గేమ్స్‌పైనే. అందుకు అనుగుణంగానే శిక్షణ పొందుతున్నాను. కామన్వెల్త్ గేమ్స్‌లో నా ప్రదర్శన, ప్రయత్నం ఆ ప్రణాళికపైనే ఆధారపడి ఉంటాయి. ఒక నిర్దిష్ట రోజున శరీరం ఎలా స్పందిస్తుందో నిజంగా అంచనా వేయలేం. ఆసియా క్రీడల్లో 90 కేజీల బరువు ఎత్తడానికి తప్పకుండా ప్రయత్నిస్తాను. పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టినప్పటి నుంచి నేను 48 లేదా 49 కిలోల బరువును మాత్రమే కొనసాగిస్తూ వస్తున్నాను. బరువును అదుపులో ఉంచుకోవడం చాలా కష్టమైన విషయం. ఎన్నో అంశాలపై నిరంతరం దృష్టిసారించాల్సి ఉంటుంది. ఒక అథ్లెట్ జీవితంలో సగం సమయం దీనికే ఖర్చువుతుంది" అని చాను పేర్కొంది. లాస్ ఏంజెలెస్ 2028 క్రీడలకు ముందు ఒలింపిక్ వెయిట్ కేటగిరీలలో (బరువు విభాగాలలో) జరిగిన మార్పుల నేపథ్యంలో ఆసియా క్రీడల తర్వాత తాను 53 కిలోల విభాగంలోకి మారాలని భావిస్తున్నట్లు చాను వెల్లడించింది. టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు, కామన్వెల్త్ గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాలను సాధించిన చాను.. ఆసియా క్రీడల్లో మాత్రం ఒక్క మెడల్ గెల్చుకోలేకపోయింది.

# సెప్టెంబరు 19 నుంచి ఆసియా క్రీడలు

### నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు భారత క్రికెట్ జట్లు




జపాన్‌లో సెప్టెంబరు 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఈ పోటీల్లో క్రికెట్ కూడా ఉండటంతో టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. 2023లో చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్‌లుగా బరిలోకి దిగబోతున్నాయి. ఈ రెండు జట్లూ నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పురుషుల విభాగంలో భారత్‌తో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక టాప్ సీడ్ జట్లుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. మిగిలిన నాలుగు క్వార్టర్ ఫైనల్స్ బెర్తుల కోసం ఆరు జట్లు పోటీ పడుతున్నాయి. గ్రూప్-ఎలో అఫ్గానిస్థాన్, జపాన్, నేపాల్.. గ్రూప్-బిలో హాంకాంగ్ చైనా, మలేసియా, ఒమన్ ఉన్నాయి. ప్రతి గ్రూప్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు టాప్-8కు అర్హత సాధిస్తాయి. సెప్టెంబర్ 28న భారత్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. అక్టోబర్ 1న సెమీ ఫైనల్స్, 3న కాంస్య పతక మ్యాచ్.. అదే రోజు గోల్డ్ మెడల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. మహిళల విభాగంలో ఎనిమిది జట్లకు డైరెక్ట్ నాకౌట్ విధానంలో సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు మ్యాచ్‌లు నిర్వహిస్తారు. క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌తో భారత్, బంగ్లాదేశ్‌తో చైనా, శ్రీలంకతో మలేసియా, పాకిస్థాన్‌తో థాయ్‌లాండ్ తలపడనున్నాయి. ఆసియా క్రీడల్లో క్రికెట్‌ను నిర్వహించడం ఇది నాలుగోసారి. అంతకుముందు 2010, 2014, 2023లో నిర్వహించారు.

## భారత్‌లో యాషెస్ సిరీస్ మ్యాచ్‌లు





బిగ్‌బాష్ లీగ్ 2026లో తొలి మ్యాచ్‌కు చెన్నైలోని చెపాక్ స్టేడియం ఆతిథ్యమివ్వన్న సంగతి తెలిసిందే. భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడా భాగస్వామ్య కార్యక్రమంలో భాగంగా డిసెంబరులో ఈ మ్యాచ్ జరగనుంది. భవిష్యత్‌లో ఆస్ట్రేలియా-ఇంగ్లాండ్ మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ మ్యాచ్‌లు కూడా భారత్‌లో నిర్వహించే అవకాశముంది. ఈ విషయాన్ని పరిశీలిస్తామని క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్ బర్గ్ పేర్కొన్నారు. "అన్ని ఆప్షన్లను పరిశీలించడానికి మేం సిద్ధంగా ఉండాలి. ఈసీబీతోనే కాకుండా బీసీసీఐతో కూడా మాకు చాలా మంచి సంబంధాలు ఉన్నాయి. భారత్‌లో కొన్ని ప్రాంతాల్లో మరింత క్రికెట్ వినోదాన్ని అందించేందుకు అవకాశాలు ఉన్నాయి. దీని గురించి (భారత్‌లో యాషెస్ సిరీస్) మేం ప్రస్తుతం ఎలాంటి ప్రణాళికా సిద్ధం చేయనప్పటికీ.. భవిష్యత్తులో కచ్చితంగా పరిశీలించే అవకాశముంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్ మధ్య టెస్టు క్రికెట్‌కు ఎంతో ఆదరణ ఉంది. దీనిని మరింత బలోపేతం చేయడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాం" అని టాడ్ గ్రీన్ బర్గ్ తెలిపారు. వచ్చే ఏడాది జరిగే యాషెస్ (స్వాంప్రవం) సిరీస్ షెడ్యూల్‌ను ఈసీబీ ఇటీవల ప్రకటించింది. 2029-30లో జరిగే సిరీస్ ఆతిథ్య హక్కులు క్రికెట్ ఆస్ట్రేలియాకు వస్తాయి.

## ఇలాంటి ఇన్నింగ్స్‌తో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

### వైభవ్ సూర్యవంశీ

జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) మెరుపులు మెరిపించాడు. హాఫ్ సెంచరీ అనంతరం అతడు చేతివేళ్లతో 'మా' అక్షరం చూపిస్తూ సెలబ్రేట్ చేసుకున్నాడు. అలా తన తల్లి కోసం చూపించినట్లు వైభవ్ తెలిపాడు. ఇక ఈ ఇన్నింగ్స్‌తో మూడు ప్రపంచ రికార్డులను అతడు బ్రేక్ చేశాడు. దీనిపై స్పందిస్తూ.. "కెరీర్ ప్రారంభంలో ఇలాంటి ఇన్నింగ్స్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా గొప్పగా బ్యాటింగ్ చేయడానికే ప్రయత్నిస్తా. జట్టు కోసం నా బెస్ట్ ఇవ్వడానికి కష్టపడతా" అని వైభవ్ తెలిపాడు.






## తక్కువ క్రెడిట్ స్కోరుతో రుణం కావాలా..?

రుణాల విషయంలో యువ దరఖాస్తుదారులు తరచుగా ఒక సంక్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటుంటారు. సాధారణంగా వీరికి క్రెడిట్ హిస్టరీ ఉండదు. ఈ కారణంగా బ్యాంకులు, వారి క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాల అభ్యర్థనలను తిరస్కరిస్తాయి. భారత్‌లో సుమారు కొన్ని కోట్ల మంది యువ నిపుణులు ఉద్యోగ రంగంలో, ఇతర వృత్తుల్లో పనిజేస్తున్నారు. కానీ, పట్టణ ప్రాంతాల్లోని యువతలో క్రెడిట్ కార్డుల వినియోగం ఇప్పటికీ చాలా తక్కువగానే ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ అంతరానికి ప్రధాన కారణం ఏంటంటే, చాలా మంది సంప్రదాయ రుణ సంస్థలు కొత్తగా రుణాలు ఆశించేవారికి రుణాలు ఇవ్వడం లేదు. అటువంటి రుణగ్రహీతలు తమ క్రెడిట్ ట్రాక్ రికార్డును మెరుగుపరచుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు/వనరుల కోసం ప్రయత్నించాలి. బ్యాంకులు.. రుణ దరఖాస్తుదారుల అభ్యర్థనలను తిరస్కరిస్తే, వారు డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫాంలు,ూ2ూ రుణ సంస్థలను ఆశ్రయించవచ్చు. తక్కువ క్రెడిట్ స్కోరు ఉన్నవారికి లేదా అసలు క్రెడిట్ స్కోరు లేని వారికి కూడా ఇవి రుణాలు అందిస్తాయి. ఈ ఫిన్-టెక్ కంపెనీలు మొబైల్ యాప్ ఆధారిత రుణ ప్లాట్‌ఫాంలను కలిగి ఉన్నాయి. ఇవి ఉద్యోగులకు ఎక్కడైనా, ఎప్పుడైనా నిమిషాల వ్యవధిలో రుణం తీసుకోవడానికి వీలు కల్పిస్తాయి. ఈ రుణాలు ముఖ్యంగా యువ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నవని చెప్పవచ్చు. సాధారణంగా 700 లేదా అంతకంటే ఎక్కువ క్రెడిట్ స్కోరును మెరుగైందిగా పరిగణిస్తారు. క్రెడిట్ స్కోరు, ఒక వ్యక్తి తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని ప్రతిబింబించే ముఖ్యమైన అంశం. అయినప్పటికీ, అది ఒక వ్యక్తికి సంబంధించిన మొత్తం రుణ అర్హతను ప్రతిబింబించడానికి సరిపోదని నిపుణులు అంటున్నారు. సాధారణంగా, సంప్రదాయ రుణ సంస్థలు కేవలం క్రెడిట్ స్కోరుపై మాత్రమే దృష్టి పెడతాయి. కానీ, డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫాంలు రుణ దరఖాస్తుదారుడికి సంబంధించిన పరిస్థితిని నిర్ధారించడానికి సంప్రదాయ, ఇతర డేటా పాయింట్లను కూడా పరిగణనలోకి తీసుకుంటాయి. పీర్-టు-పీర్ లెండింగ్ ప్లాట్‌ఫాంలు.. వ్యక్తిగత రుణ దరఖాస్తుదారులను నేరుగా రుణాలిచ్చేవారితో కలుపుతాయి. ఈ ప్లాట్‌ఫాంలు, సంప్రదాయ రుణ సంస్థల ప్రమేయం లేకుండా, డబ్బు ఉన్న వ్యక్తులు ద్వారా అవసరమైన వారికి రుణాలు ఇచ్చేందుకు ఒక వేదికను సృష్టిస్తాయి. అయితే, దరఖాస్తుదారులు ఇలాంటి ప్లాట్‌ఫాంను ఎంచుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి. ఎందుకంటే, గత సంవత్సరం జరిగిన పరిశీలనలో ఆర్‌బీఐ వీటిలో కొన్నింటిపై కఠిన చర్యలు తీసుకుంది. కాబట్టి, ఎలాంటి ప్లాట్‌ఫాంలు పారదర్శకత వహిస్తున్నాయో మీరు తప్పక చూడాలి. ఈ రుణ ప్రక్రియ.. వేగంగా, కాగితరహితంగా ఉంటుంది. ప్రతీదీ ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. కొన్ని ప్లాట్‌ఫాంలు 24 నుంచి 48 గంటలలోపు నిధులను పంపిణీ చేస్తాయి. అయితే, ఇందులో వడ్డీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. బ్యాంకులు సేవలు అందించని విభాగానికి సేవ చేయడానికి పీర్-టు-పీర్ రుణ సంస్థలు ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం, ఫెయిర్‌సెంట్, లెండ్‌బాక్స్, ఐ-లెండ్, ఐ2ఐఫండింగ్, లెన్‌డెన్‌క్లబ్ వంటి సంస్థలతో సహా అనేక రుణ సంస్థలు రుణాలిచ్చేవారిలో ఉన్నాయి. ఈ ప్లాట్‌ఫాంలు రుణం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తులను, ఆర్థిక సహాయం కోరుకునే వారితో కలుపుతాయి. వారు కూడా రిస్క్ అంచనా కోసం ప్రత్యామ్నాయ క్రెడిట్ స్కోరింగ్ పద్ధతులను ఉపయోగిస్తారు. ఈ ఫిన్-టెక్ సంస్థలు రుణాలను త్వరగా పంపిణీ చేస్తున్నప్పటికీ, వాటి రుణాలపై వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది. వడ్డీ రేటు 11.99 నుంచి 36 శాతం మధ్య ఉంటుంది. సాధారణంగా నెలకు రూ. 30,000 వరకు ఆదాయం ఉండి, 700 కంటే తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న రుణ దరఖాస్తుదారుల నుంచి అధిక వడ్డీ రేట్లు వసూలు చేస్తాయి.



## ఆగస్టు 1న 'శంభో శివ శంభో' రీ-రిలీజ్

రవితేజ, శివ బాలాజీ, అల్లరి నరేశ్ కీలక పాత్రల్లో సముద్రఖని దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ డ్రామా 'శంభో శివ శంభో'. 2010లో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. తమ స్నేహితుడి ప్రేమను గెలిపించడానికి ముగ్గురు స్నేహితులు ఎలాంటి సాహసం చేశారు? దాని వల్ల వారి జీవితాలు ఎలా మారాయి? చివరకు ప్రేమ గెలిచిందా? స్నేహం గెలిచిందా? అన్న అంశంతో సముద్రఖని దీన్ని తీర్చిదిద్దారు. అప్పట్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన ఈ మూవీ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 1న 'శంభో శివ శంభో'ను ఎంపిక చేసిన థియేటర్స్‌లో రీ-రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విడుదలైన ట్రైలర్‌ను మీరూ చూసేయండి.ఈ

## 'రామాయణ' ట్రైలర్ వాయిదా..

భారతీయ సినీ చరిత్రలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ట్రైలర్‌ను నేడు భారీ స్థాయిలో విడుదల చేయాలని భావించారు. చివరి నిమిషంలో ఆ ఈవెంట్ వాయిదా పడింది. త్వరలోనే ట్రైలర్ విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత నమిత్ మల్హోత్రా పోస్టు పెట్టారు. "రామాయణాన్ని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లాలనే నా కల ఇప్పుడు 'సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్' భాగస్వామ్యంతో నిజం కానుంది. దీన్ని అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి చివరి నిమిషంలో ట్రైలర్‌ను వాయిదా వేస్తున్నాం. త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తాం. 100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన భారతీయ సినీ రంగంలో ఈ సినిమా గర్వకారణంగా నిలవనుంది. హాలీవుడ్ సినిమాలకు దీటుగా ఉంటుంది. 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుంది" అని తెలిపారు. ఇక ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ నటించారు. మొదటి భాగాన్ని ఈఏడాది దీపావళికి, రెండోభాగాన్ని వచ్చే సంవత్సరం దీపావళికి విడుదల చేయనున్నారు. సుమారు రూ.4000 కోట్లతో దీన్ని రూపొందిస్తున్నారు.



## నా హృదయం ముక్కలైంది : ఆలియా భట్

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీ వేదికగా విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి రోజు రోజుకు మద్దతు పెరుగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ ఉద్యమానికి తన మద్దతును తెలుపుతూ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది బాలీవుడ్ నటి ఆలియా భట్. 'గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలతో నా హృదయం ముక్కలైంది.. అదే సమయంలో విద్యార్థులు చూపిస్తున్న ధైర్యం మళ్లీ ఆశను కలిగించింది. ప్రతి విద్యార్థి వెనుక కుటుంబం కలలు, ఎన్నో త్యాగాలు, భవిష్యత్తుపై ఆశలు దాగి ఉంటాయి' అంటూ భావోద్వేగ నోట్ షేర్ చేసిన ఆలియా.. దేశ భవిష్యత్తును నిర్మించబోయే యువత గొంతును వినాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.. 'జై హింద్.. విద్యార్థుల కోసం.. విద్యార్థుల చేత' అంటూ అన అభిప్రాయాన్ని పంచుకుంది.



## పెళ్లి గురించి అడగొద్దు



స్టార్ నటి, సింగర్‌గా ఇండస్ట్రీలో రాణిస్తున్న శృతి హాసన్ కోలీవుడ్, టాలీవుడ్ అని తేడా లేకుండా తన నటనతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేస్తున్నారు. గత ఏడాది 'కూలీ'చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న ఆమె ప్రస్తుతం ట్రైన్, సలార్-2, ఆకాశంలో ఒక తార వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తూ ఫుల్ బిజీ అయిపోయారు. ఒకవైపు నటిగా రాణిస్తూనే, మరోవైపు సింగర్‌గానూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో విశేషాలను పంచుకుంటారు. సినిమా పరిశ్రమలోకి వచ్చి 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శృతి హాసన్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పెళ్లికి సంబంధించిన ప్రశ్న ఎదురైంది. మీ పెళ్లి గురించి ఏమైనా ఆలోచనలు ఉన్నాయా అని ఒక అభిమాని అడగ్గా.. శృతి స్పందిస్తూ, తను ఇండస్ట్రీలోకి వచ్చి 17 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని జరుపుకుంటున్నానని, కానీ ఈ పెళ్లి ప్రశ్నకు మాత్రం గత 15 ఏళ్లుగా సమాధానం చెప్తూనే ఉన్నానని అన్నారు. దయచేసి తనను పెళ్లి గురించి అడగొద్దని, ప్రస్తుతం తనకు అలాంటి ఆలోచనలు ఏమీ లేవని స్పష్టం చేశారు. ప్రస్తుతం తన దృష్టి అంతా సినిమాలపైనే ఉందని వెల్లడించారు. తన రాబోయే ప్రాజెక్ట్‌ల పట్ల చాలా ఉత్సాహంగా ఉన్నానని, త్వరలోనే వాటికి సంబంధించిన అప్‌డేట్‌లను ప్రకటిస్తానని తెలిపారు.

## స్టైలిష్‌గా రకుల్ ప్రీత్ సింగ్

మోస్ట్ హాటెస్ట్ అండ్ బ్యూటిఫుల్ నటి రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తెలుగు సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాల భామ ప్రస్తుతం తమిళ్, హిందీ చిత్రాల్లో వరుస అవకాశాలు అందుకుంటూ తన కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తోంది. సినిమాల్లో తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే రకుల్, సోషల్ మీడియాలోనూ అదే స్థాయిలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులను అలరిస్తోంది. ఇక రకుల్ ఏ సినిమా ఈవెంట్‌కైనా, పబ్లిక్ అపియరెన్స్‌కైనా స్టైలిష్ అవుట్‌ఫిట్‌లతో హాజరవుతూ అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంటుంది. ఆమె ధరించే ఫ్యాషన్‌బుల్ డ్రెస్సులు, స్టైలిష్ లుక్స్ సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతుంటాయి. తాజాగా కూడా రకుల్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఫొటోల్లో రకుల్ నలుపు రంగు టైట్ స్టైలిష్ డ్రెస్‌లో మెరిసిపోయింది. సిల్వర్ కలర్ చిన్న ఇయర్‌రింగ్స్‌తో తన లుక్‌కు మరింత అందాన్ని జోడించింది. స్టైలిష్ పోజులు, ఆకట్టుకునే ఎక్స్‌ప్రెషన్స్‌తో అభిమానులను ఫిదా చేస్తోంది. మొత్తంగా ఈ ఫొటోల్లో రకుల్ ఎంతో గ్లామరస్‌గా, స్టైలిష్‌గా కనిపించడంతో ఆమె తాజా పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## చెన్నై లవ్‌స్టోరీ..

# కదిలించే ప్రేమకథే..

నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆ ఘటనతో నివి గుండె ఒక్కసారిగా బద్దలైపోతుంది. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పు రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయట పడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగింది? వీళ్ల ప్రేమకథలో ఎదురైన సవాళ్లేంటి? మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి పెళ్లి పీటలపై నివిని వదిలేసి వెళ్లిపోయిన అజయ్.. మళ్లీ ఆమె జీవితంలోకి ఎందుకొచ్చాడు? ఆఖరికి నివి ఎవరిని పెళ్లి చేసుకుంది? అన్నది మిగిలిన కథ.

**ఎలా సాగిందంటే...**

తొలి ప్రేమ ఎప్పటికీ మధుర జ్ఞాపకమే.. అది మనసు పొరల్లో శాశ్వతంగా నిలిచిపోతుందంటూ 'బేబీ'తో ఓ భావోద్వేగభరిత ప్రేమకథని చూపించి అందరిని మెప్పించారు దర్శకుడు సాయి రాజేశ్. ఇప్పుడాయన ఈ 'చెన్నై లవ్‌స్టోరీ'తో మలి ప్రేమ గొప్పదనాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. కానీ, ఈసారి ఈ కథని తనదైన శైలిలో మనసుల్ని బలంగా తాకేలా చూపించడంలో కాస్త తడబడ్డారు. ఇప్పటి వరకు మన సినిమాల్లో ప్రేమ కోసం దేవదాసుగా మారిన హీరోల్నే చూశాం. కానీ, ఈ చిత్రంతో దర్శకుడు కొత్తగా ప్రేమ కోసం దేవదాసైన కథానాయికని పరిచయం చేశారు. అలా ప్రేమలో విఫలమై.. మందు బాటిల్ పట్టుకున్న కథానాయిక కోణం నుంచి కథని ఆరంభించిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. హీరో పరిచయ సన్నివేశాలు చాలా సింపుల్‌గా ఉంటాయి. అతను కథానాయిక ఇంట్లోకి చేరినప్పటి కథ కాస్త వేగం పుంజుకుంటుంది. బ్రేకప్ బాధలో నుంచి బయటపడలేక నివి పడే వేదన.. ఆమెలో మార్పు తేవాలన్న తపనతో హీరో చేసే తింగరి పనులు.. ఈక్రమంలో ఆమెతో పడే చివాట్లు.. ప్రేక్షకుల్ని నెమ్మదిగా వారి కథ ప్రపంచంలో కూర్చోబెడతాయి. ఇక ఎప్పుడైతే నాయకానాయికల మధ్య ప్రేమ మొదలవుతుందో.. అక్కడి నుంచి కథ రెట్టింపు వేగాన్ని పుంజుకుంటుంది. ఇక ఈ మధ్యలో వచ్చే "గుర్తుందా పాట" ప్రేక్షకుల్లో ఓ జోష్‌ని నింపుతుంది. అయితే విరామ ఘట్టాలు షాకింగ్‌గా.. మనసుల్ని బరువెక్కించేలా ఉంటాయి. ఆ సీక్వెన్స్ చూశాక దర్శకుడు ద్వితీయార్ధాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తాడా? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో మొదలవుతుంది. కానీ, సెకండాఫ్ మొదలైన కాసేపటికే దర్శకుడు లాజిక్‌ని పక్కకు పెట్టి.. మ్యాజిక్‌తో కథను ముందుకు తీసుకెళ్లబోతున్నాడన్నది అర్థమవుతోంది. కాకపోతే ఆ ఫాంటసీ టచ్ ఏమంత కన్విన్సింగ్‌గా అనిపించదు. ఈ సినిమా ఫస్ట్‌హాఫ్‌లో ఓ హోటల్‌లో పని చేసే ఓ కుర్రాడు తన తండ్రి ఆత్మతో మాట్లాడుతున్నట్లు ఓ సన్నివేశాన్ని చూపిస్తాడు. ఆ పిల్లాడి కథని వివరిస్తూ ఆ హోటల్ యజమాని 'తను నిజంగా వాళ్ల నాన్నతో మాట్లాడుతున్నాడన్నది నమ్మిన వాళ్లకి నిజం. నమ్మని వాళ్లకి అబద్ధం' అని ఓ డైలాగ్ చెప్తాడు. అక్కడ తనెందుకు ఆ సీన్ పెట్టాడన్నదానికి ద్వితీయార్ధంలో సమాధానం దొరుకుతుంది. పతాక ఘట్టాలు భావోద్వేగభరితంగా తీర్చిదిద్దినా.. అవన్నీ ప్రేక్షకులకు ఊహలకి అందేలా ఉంటాయి.




PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com